PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd
Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna
హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 62 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శనివారం 28 ఫిబ్రవరి 2026

## రోడ్డు భద్రత నియమాలు పాటించాలి




## "ఉపాధ్యాయులకు వేతనాలు ఎక్కువ" అనే వాఖ్యం అనుచితం




అచ్చు సుదర్శన్ అధ్యక్షులు కటుకోజ్వల సతీష్ ప్రధాన కార్యదర్శి

## ఎపి కొత్త సిఎస్‌గా సాయిప్రసాద్

- నేడు బాధ్యతలు స్వీకరించనున్నట్లు వెల్లడి




## నేటి నుంచి హెచ్‌పీవీ వ్యాక్సినేషన్



**హైదరాబాద్,ఫిబ్రవరి 27(పీసీడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో సర్వైకల్(గర్భాశయ ముఖద్వార) క్యాన్సర్ నివారణ లక్ష్యంగా నేటి నుంచి హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) వ్యాక్సినేషన్ డ్రైవ్ నిర్వహించనున్నారు. కింగ్ కోఠి జిల్లా దవాఖానలో నేడు (శనివారం) ఉదయం 11 గంటలకు వ్యాక్సినేషన్ పంపిణీ కార్యక్రమాన్ని ఆరోగ్యశాఖ మంత్రి

మిగతా2లో...

## తమిళనాడు ఒకే విడతలో ఎన్నికలు

- పరిశీలనలో ఉందన్న ఎన్నికల సంఘం ఛైర్మన్




## దోమల నివారణ, శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి



- కేటాయించిన స్థలంలోనే చెత్త వేసేలా అవగాహన
- హోటల్స్‌లో ఫుడ్ సేఫ్టీకి ప్రత్యేక చర్యలు
- అవసరమైతే కిచన్‌లలో సిసి కెమెరాల ఏర్పాటుతో పరిశీలన
- మున్సిపల్ శాఖపై సమీక్షలో సిఎం రేవంత్ సూచనలు

**హైదరాబాద్,ఫిబ్రవరి 27(పీసీడబ్ల్యూ న్యూస్):** శానిటేషన్, దోమల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు దిశానిర్దేశంచేశారు. మున్సిపల్ అధికారులు మార్క్ చేసిన చోటనే చెత్త వేసేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సమావేశానికి సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సీఎం పలు సూచనలు చేశారు. ఎప్పటికప్పుడు పనులు పూర్తి చేసేందుకు అవసరమైతే టెక్నాలజీని ఉపయోగించాలని సీఎం రేవంత్‌రెడ్డి మార్గనిర్దేశం చేశారు. కోర్ అర్బన్ రీజియన్‌లో ఉన్న అన్ని స్ట్రీట్‌లైట్స్‌కు ప్రత్యేక నెంబర్ ఇచ్చి డ్యాష్ బోర్డుకు కనెక్ట్ చేయాలని సూచించారు. టెక్నాలజీ ద్వారా సమస్య తలెత్తిన చోట వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. నగర పరిధిలో ఫుడ్ సేఫ్టీకి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. హోటల్స్‌లోని కిచెన్‌లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించాలని దిశానిర్దేశం చేశారు. తరచూ తనిఖీలు నిర్వహించడంతో పాటు ప్రత్యేక మానిటరింగ్ వింగ్ ఎప్పటికప్పుడు పరిశీలించేలా చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్దేశించారు. హోటల్స్‌కి రేటింగ్, సర్టిఫికేట్ ఇచ్చే విధానాన్ని పరిశీలించాలని సూచించారు.

మిగతా2లో...

## ఢిల్లీ మద్యం కేసులో అభియోగాలే తప్ప ఆధారాలేవీ..

- కేసును కొట్టివేస్తూ సిబిఐపై కోర్టు తీవ్ర వ్యాఖ్యలు
- ఆధారాలు లేకుండా కేసు నడిపారని మండిపాటు
- కేజ్రీవాల్, సిసోడియా, కవితలపై కేసు కొట్టివేత
- ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేస్తామని సిబిఐ వెల్లడి



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 27(పీసీడబ్ల్యూ న్యూస్):** ఢిల్లీ మద్యం లిక్కర్ పాలసీ కేసును ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు కొట్టి వేసింది. ఈ కేసులో దోషులుగా ఉన్న దిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజీ్రవాల్ , మాజీ ఉప ముఖ్యమంత్రి సిసోదియా, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎంపీ కవిత కు భారీ ఊరట లభించింది. మద్యం పాలసీ కేసుపై తాజాగా విచారణ జరిపిన రౌస్ అవెన్యూ కోర్టు నిందితులందరి పైన నమోదు చేసిన కేసులు కొట్టివేసింది. వారందరి పేర్లను డిశ్చార్జ్ చేసినట్లు వెల్లడించింది. సరైన ఆధారాలు లేకుండానే వీరి పేర్లు కేసులో చేర్చారని సీబీఐపై ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ కేసులో పూర్తిగా లోపభూయిష్టమైన దర్యాప్తు జరిగిందని కోర్టు సీబీఐపై మండిపడింది. ఈ విషయంలో సీబీఐ అధికారుల పైనే దర్యాప్తు

మిగతా2లో...

## జీఐ ఆన్ వీల్స్.. టీజీఎస్ఆర్టీసీ శ్రీకారం

- బస్సులపై జీఐ వారసత్వ ప్రదర్శన
- జీఐ హస్తకళలతో అలంకరించిన ప్రత్యేక బస్సులు
- జెండా ఊపి ప్రారంభించిన గవర్నర్ , మంత్రి పొన్నం




**హైదరాబాద్,ఫిబ్రవరి 27(పీసీడబ్ల్యూ న్యూస్):** దేశంలోనే తొలిసారిగా 'జీఐ ఆన్ వీల్స్' కార్యక్రమాన్ని శుక్రవారం హైదరాబాద్‌లోని మహాత్మా గాంధీ బస్ స్టేషన్ వద్ద తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రారంభించారు. కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ , టీజీఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ / మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి , హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి పాల్గొన్నారు. సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, జీఐ గుర్తింపు పొందిన కళారూపాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, వాటిని ప్రాచుర్యంలోకి తీసుకురావడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ మని అన్నారు. తెలంగాణ యువ రాష్ట్రంగా సాంస్కృతిక గుర్తింపును బలోపేతం

మిగతా2లో...



## న్యాయవ్యవస్థపై పెట్టుకున్న నమ్మకం నిలబడింది

- కడిగిన ముత్యంలా బయటకు వస్తానని ఆనాడే చెప్పా...
- కష్టకాలంలో అండగా నిలిచి వారిందరికీ కృతజ్ఞతలు
- ఢిల్లీ కోర్టు తీర్పుపై కవిత హర్షం

**హైదరాబాద్,ఫిబ్రవరి 27(పీసీడబ్ల్యూ న్యూస్):** న్యాయ వ్యవస్థపై తాను పెట్టుకున్న నమ్మకం నిలబడిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎంపీ కవిత అన్నారు. తను నిందితురాలిగా ఉన్న దిల్లీ మద్యం కేసును కోర్టు కొట్టివేసిన నేపథ్యంలో హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. నేను కడిగిన ముత్యంలా బయటికి వస్తానని తెలంగాణ ప్రజలకు మొదట్నుంచి చెబుతున్నాను. అలాగే వచ్చాను.

మిగతా2లో...

## రాష్ట్రంలో కాంగ్రెస్ ఉన్నా.. నడిగడ్డ బిఆర్ఎస్ వెనకే...

- పాలమూరులో గెలిచిన కౌన్సిలర్లకు సన్మానం - రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందన కెటిఆర్




**హైదరాబాద్,ఫిబ్రవరి 27(పీసీడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పటికీ నడిగడ్డలో మాత్రం ప్రజల విశ్వాసం ఇప్పటికీ బీఆర్ఎస్ పైనే ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. నడిగడ్డ స్ఫూర్తి రాష్ట్రం మొత్తం వ్యాపించాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున గెలిచిన కౌన్సిలర్లకు తెలంగాణ భవన్‌లో సన్మానించారు. సర్పంచ్ ఎన్నికల నుంచి మున్సిపల్ ఎన్నికల వరకు మెజారిటీ స్థానాలు గెలుచుకోవడం పార్టీ బలాన్ని నిరూపిస్తోందన్నారు. ఆలంపూర్, ఐజ, గద్వాల, వడ్డేపల్లి ప్రాంతాల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు అందించిన మద్దతు విశేషమని తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం అరాచక పాలన నడుస్తోందని కేటీఆర్ విమర్శించారు.

మిగతా2లో...

## జూబ్లీహిల్స్‌లో ఫ్లై ఓవర్ పనులు ప్రారంభం

- ట్రాఫిక్ మళ్లింపు చేపట్టిన పోలీసులు
- పనులు పరిశీలించిన సిపి సజ్జనార్



**హైదరాబాద్,27(పీసీడబ్ల్యూ న్యూస్):** బంజారాహిల్స్ రోడ్ నెంబర్-2లో పార్క్ హయత్ వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు ప్రారంభమ య్యాయి. నిర్మాణ పనులని మేఘా నిర్మాణ సంస్థ ప్రారంభించింది. వంతెన నిర్మాణ పనులు ప్రారంభమైన ప్రాంతాన్ని హైదరాబాద్ సీపీ సజ్జనార్ పరిశీలించారు. సీపీ సజ్జనార్‌తో పాటు ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవి స్ నిర్మాణ సంస్థ ప్రతినిధులు పరిశీలించారు. ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు ప్రా రంభమైన సందర్భంగా శుక్రవారం నుంచి పలుమార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

మిగతా2లో...

## లొంగిన మావోయిస్టులకు అండ

- రివార్డులు త్వరగా అందచేస్తాం
- లొంగిన నేతలతో సిఎం రేవంత్ భేటీ



**హైదరాబాద్,ఫిబ్రవరి 27(పీసీడబ్ల్యూ న్యూస్):** మావోయిస్టుల అగ్రనేతలతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం సచివాలయంలో సమావేశం అయ్యారు. ఈ క్రమంలో మావోయిస్టుల లొంగుబాటు పాలసీపై సీఎం చర్చించారు. ఈ సందర్భంగా ఒక్కొక్కరిని పలకరించారాయన. మావోయిస్టుల పునరావాసంపై హామీ ఇచ్చారు. లొంగిపోయిన మావో నేతలపై ఉన్న రివార్డును వెంటనే అందించేలా

మిగతా2లో...

# ఢిల్లీ మద్యం కేసులో అభియోగాలే తప్ప ఆధారాలేవీ

(మొదటి పేజీ తరువాయి)

జరగాలని కోర్టు పేర్కొంది. కవిత ఆడిటర్ బుచ్చిబాబు సహా అభియోగాలు మోపిన 23 మందికి ఈ కేసు నుంచి విముక్తి కల్పిస్తున్నట్లు తెలిపింది. వారిపై ఉన్న అభియోగాలను నిరూపించడంలో సీబీఐ విఫలమైందని వ్యాఖ్యానించింది. ఎటువంటి ఆధారాలు లేకుండా కేవలం ఊహాగానాల ఆధారంగా ఈ కేసులో కుట్ర జరిగిందని సీబీఐ అధికారులు ఆరోపించారని న్యాయ స్థానం పేర్కొంది. కానీ దానిని నిరూపించడంలో విఫల మయ్యారని ఆగ్రహం వ్యక్తంచేసింది. ఎక్సైజ్ పాలసీపై ముగ్గురు న్యాయ నిపుణుల అభిప్రాయాలు తమ కేసుకు మద్దతు ఇస్తున్నాయని గతంలో సీబీఐ చేసిన ప్రకటనపై స్పష్టత ఇవ్వాలని అధికారులను ఆదేశించింది. ఈ కోర్టు తీర్పును సవాలుచేస్తూ సీబీఐ అధికారులు దిల్లీ హైకోర్టును ఆశ్రయించనున్నట్లు తెలుస్తోంది. దిల్లీ ప్రభుత్వం 2021 నవంబర్ 17న మద్యం పాలసీని తీసుకొచ్చింది. 2022 సెప్టెంబరు చివరికి దానిని వెనక్కి తీసుకుంది. ఈ మధ్యలో మద్యం విధానంలో పలు అవకతవకలు జరిగాయని.. ఆప్ నేతలు మనీలాండరింగ్‌కు పాల్పడ్డారంటూ ఆరోపణలు వచ్చాయి. ఎక్సైజ్ పాలసీని సవరించేటప్పుడు వీరు అక్రమాలకు పాల్పడ్డారని సీబీఐ, ఈడీలు ఆరోపించాయి. లైసెన్స్‌దారులకు అవసరమైన సాయం చేసి, ప్రతిఫలంగా కొంత మొత్తాన్ని పొందినట్లు దర్యాప్తు సంస్థలు చెప్పాయి. ఈ కుంభకోణంలో భాగంగా దిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మాజీ ఉప ముఖ్యమంత్రి సిసోదియా, ఇతర ఆప్ నేతలు, మాజీ తెలంగాణ ఎంపీ కవితలను అధికారులు అరెస్టు చేశారు. వారు బెయిల్‌పై విడుదలయ్యారు.ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు భారీ ఊరట లభించింది. సీబీఐ కోర్టు ఈ కేసునుంచి కేజ్రీవాల్‌ను డిశ్చార్జ్ చేసింది. శుక్రవారం ఢిల్లీ మద్యం పాలసీ కేసుపై ది రౌస్ అవెన్యూ కోర్టు విచారణ జరిపింది. సీబీఐ వేసిన చార్జ్‌షీట్‌లో మెరిట్ లేదని కోర్టు పేర్కొంది.మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌తో పాటు ఉప ముఖ్యమంత్రి సిసోడియాకు కూడా క్లీన్‌చిట్ ఇచ్చింది. కవితతో పాటు 23 మంది నిందితులు తప్పు చేసినట్టు సాక్ష్యాధారాలు లేవని కోర్టు స్పష్టం చేసింది. అందరికీ క్లీన్ చిట్ ఇచ్చింది. అయితే, రౌస్ అవెన్యూ కోర్టు తీర్పును సీబీఐ సవాల్ చేయనుంది.

# జీఐ ఆన్ వీల్స్.. టీజీఎస్ఆర్టీసీ శ్రీకారం

(మొదటి పేజీ తరువాయి)

చేసుకోవడం అవసరమని తెలిపారు. సంస్కృతి సమాజానికి ఆత్మస్వరూపమని, సాంస్కృతిక అవగాహన లేకుండా సమాజం అభివృద్ధి సాధ్యం కాదని అన్నారు. ఈ తరహా కార్యక్రమాలు యువతలో సంప్రదాయ కళలపై ఆసక్తిని పెంచుతాయని, కళాకారులకు గౌరవాన్ని కల్పిస్తాయని పేర్కొన్నారు. రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ఈ కార్యక్రమం గవర్నర్ గారి దూరదృష్టి ఫలితమని తెలిపారు. జీఐ ఉత్పత్తుల ప్రాచుర్యం, మార్కెటింగ్ మరియు విస్తరణకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. ఈ చర్యల ద్వారా గ్రామీణ కళాకారులకు ఉపాధి అవకాశాలు పెరిగి, ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని చెప్పారు. టీజీఎస్ఆర్టీసీ ద్వారా ఈ కార్యక్రమాన్ని విస్తృత స్థాయిలో అమలు చేయడానికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా పోచంపల్లి ఇక్కత్ వరంగల్ , వరంగల్ తివాచీలు (కార్పెట్లు), కరీంనగర్ సిల్వర్ ఫిలిగ్రీ, నారాయణపేట్ చీరలు, చెరియల్ స్క్రోల్ పెయింటింగ్స్, నిర్మల్ పెయింటింగ్స్ వంటి తెలంగాణకు చెందిన ఆరు ప్రముఖ జీఐ హస్తకళలను బస్సులపై ప్రత్యేకంగా ప్రతిష్టించారు. ఈ కళారూపాలు తెలంగాణ కళాకారుల నైపుణ్యానికి ప్రతీకలుగా నిలుస్తూ, ప్రజా రవాణా ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత ప్రచారం పొందనున్నాయి. ప్రజా రవాణా వ్యవస్థను సృజనాత్మక వేదికగా మలచి, తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రజలకు చేరవేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా చేపట్టటం జరిగిందని మంత్రి స్పష్టం చేశారు. మేనేజింగ్ డైరెక్టర్ నాగి రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రతిబింబించే ఈ కార్యక్రమం గవర్నర్ గారి ఆలోచనల ఫలితమని తెలిపారు. బస్సులపై జీఐ కళారూపాలను ప్రదర్శించడం ద్వారా సంస్కృతిని ప్రజలకు చేరువ చేయడంతో పాటు కళాకారులకు ప్రోత్సాహం అందించడమే లక్ష్యమని చెప్పారు. బస్సులపై ప్రదర్శించిన డిజైన్లను జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ విద్యార్థులు రూపొందించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నగదు బహుమతులు మెమొంటోలు అందజేశారు. జీఐ గుర్తింపుల సాధనలో సేవలందించిన సుభజిత్ సహా ప్రత్యేకంగా సన్మానించారు. ఆరు జీఐ కళారూపాలకు చెందిన కళాకారులను కూడా ఘనంగా సత్కరించారు.తదనంతరం గవర్నర్ , మంత్రి , జిల్లా కలెక్టర్ టీజీఎస్ఆర్టీసీ అధికారులు కలిసి జీఐ హస్తకళలతో అలంకరించిన ప్రత్యేక బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. ÷బిగోళిక సూచిక (జీఐ) అనేది ఒక ప్రాంతానికి ప్రత్యేకమైన ఉత్పత్తి లక్షణాలు, నైపుణ్యం, సంప్రదాయాన్ని ప్రతిబింబించే సమిష్టి మేధో సంపత్తి హక్కు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రానికి 18 జీఐ గుర్తింపు పొందిన ఉత్పత్తులు ఉన్నాయి. జీఐ గుర్తింపు ద్వారా సంప్రదాయ కళలు, వారసత్వాన్ని సంరక్షించడం, నకిలీలను నివారించడం, కళాకారులకు గుర్తింపు కల్పించడం, వారి జీవనోపాధిని స్థిరంగా నిలుపుటకు దోహదపడుతుంది. కార్యక్రమంలో టీజీఎస్ఆర్టీసీ ఉన్నతాధికారులు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు రాజశేఖర్ , శ్రీ ఖుస్రో షా ఖాన్, రీజినల్ మేనేజర్లు శ్రీలత , సుధ పరిమళ , జేఎన్ఏఎఫ్ఏయూ ప్రతినిధులు, కళాకారులు మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఎపి కొత్త సిఎస్‌గా సాయిప్రసాద్

**అమరావతి,ఫిబ్రవరి 27(పీసీడబ్ల్యూ న్యూస్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి జి.సాయి ప్రసాద్ పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుత సీఎస్ కె.విజయానంద్ పదవీ కాలం ఫిబ్రవరి 28తో ముగియనుంది. ఆయన స్థానంలో సాయి ప్రసాద్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఇప్పటికే అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. శనివారం ఉదయం ఆయన ఏపీ సచివాలయంలో నూతన సీఎస్‌గా పదవీ బాధ్యతలు చేపడతారు. 1991 ఐఏఎస్ బ్యాచ్ ఏపీ క్యాడర్‌కు చెందిన జి.సాయి ప్రసాద్ ఎంటెక్ పూర్తిచేశారు. 1991 ఐఏఎస్‌కు ఎంపికై 1992 నుంచి 1993 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వరంగల్ అసిస్టెంట్ కలెక్టర్‌గా పనిచేశారు. అనంతరం 1993 నుంచి 1995 వరకు పాడేరు అసిస్టెంట్ కలెక్టర్‌గా పనిచేశారు. 1995 నుంచి 1997 వరకు గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా విధులు నిర్వహించారు. 1997 నుంచి 1998 వరకు కడప జాయింట్ కలెక్టర్‌గా పనిచేశారు. 2000 నుంచి 2003 వరకూ కర్నూల్ జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు. 2010 నుంచి 2011 వరకు ఏపీ హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్‌గా విధులు నిర్వహించారు. 2024 జూన్ నుంచి 2025 జనవరి వరకు జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న సాయి ప్రసాద్ శనివారం నూతన సీఎస్‌గా పదవీ బాధ్యతలు చేపట్టబోతున్నారు.

# తమిళనాడు ఒకే విడతలో ఎన్నికలు

**చెన్నై,ఫిబ్రవరి 27(పీసీడబ్ల్యూ న్యూస్):** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు ఒకే విడతలో నిర్వహించాలని పలు పార్టీలు సూచించినట్టు సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. వారి విజ్ఞప్తులను వివిధ కోణాల నుంచి పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పుడే దీనిపై ఒక స్పష్టత ఇస్తామని అన్నారు.తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల సన్నద్ధతపై జ్ఞానేశ్ కుమార్ శుక్రవారంనాడు సమీక్ష జరిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ఇటీవల రాష్ట్రంలో జరిపిన ఎస్ఐఆర్ పక్రియ దేశానికే ఒక మోడల్‌గా నిలిచిందని, విజయవంతంగా ఈ పక్రియ పూర్తయిందని చెప్పారు. ఎస్ఐఆర్‌తో పెద్ద ఎత్తున ఓటర్లను జాబితా నుంచి తొలగించనున్నట్టు కొన్ని రాజకీయల పార్టీలు విమర్శించినప్పటికీ, ఓటర్ల జాబితా ప్రక్షాళన విషయంలో ఈసీ అధికారులు ఎంతో ప్రొఫెషనలిజం కనబరిచారని ప్రశంసించారు. ఇటీవల కాలంలో ఏమాత్రం పొరపాట్లకు తావీయకుండా బీహార్ ఎన్నికలు జరిగాయని, అంతకు మించి మరింత మెరుగ్గా తమిళనాడులో ఎన్నికలు నిర్వహిస్తామని, సరికొత్త రికార్డు సృష్టిస్తామని తెలిపారు. ఓట్ల లెక్కింపు పక్రియ పూర్తయిన ఏడు రోజుల వరకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల్లో నమోదైన ఓట్లతో వీవీపాట్ల స్లిప్పులను చేసుకోవడానికి అభ్యర్థులను అనుమతిస్తామని సీఈసీ తెలిపారు. అయితే ఇందుకు కొంత మొత్తం చెల్లించాలని అన్నారు. ఈవీఎం రౌండ్లకు ముందు పోస్టల్ బ్యాలెట్లను రెండు రౌండ్లు కౌంటింగ్ జరుపుతామని చెప్పారు.

# దోమల నివారణ, శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి

(మొదటి పేజీ తరువాయి)

ఫైర్ సేఫ్టీ విషయంలో అడ్వాన్స్‌డ్ ఎక్విప్‌మెంట్ వినియోగించాలని మార్గనిర్దేశం చేశారు. నగరంలోని సిగ్నల్ జంక్షన్స్, సర్కిల్స్‌లో వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ ఏర్పాటు చేసి వర్షపు నీటిని ఒడిసి పట్టాలని సూచించారు. ఇందుకు ముందుగా కొన్ని ఏరియాలను గుర్తించి పైలట్ ప్రాజెక్టుగా వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ ఏర్పాటు చేయాలిని సీఎం రేవంత్‌రెడ్డిసూచన చేశారు.టెక్నాలజీ ద్వారా సమస్య తలెత్తిన చోట వెంటనే పరిష్కారం జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. హోటల్స్ లోని కిచెన్ లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ సెంటర్ కు అనుసంధానించాలి తరచూ తనిఖీలు నిర్వహించడంతో పాటు ప్రత్యేక మానిటరింగ్ వింగ్ ఎప్పటికప్పుడు పరిశీలించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇందుకు ముందుగా కొన్ని ఏరియాలను గుర్తించి పైలట్ ప్రాజెక్టుగా వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ ఏర్పాటు చేయాలన్నారు.

# లొంగిన మావోయిస్టులకు అండ

(మొదటి పేజీ తరువాయి)

చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అనుమతిస్తే జైల్లో ఉన్న మావోయిస్టులను కలుస్తామని మావోయిస్టు నేతలు పేర్కొన్నారు. అలాగే , లొంగిపోయిన మావోయిస్టుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. లొంగిపోవ టానికి చొరవ చూపిన ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌కి మావోయిస్ట్ నేతలు ధన్యవాదాలు తెలిపారు. చట్టప్రకారం పునరావాసం, రక్షణ పరమైన సహకారం తమ ప్రభుత్వం అందిస్తుందని భరోసా కల్పించారు. మావోయిస్టుల లొంగుబాటుపై తెలంగాణ అసెంబ్లీలో ప్రకటన చేస్తానని తెలిపారు. మావోయిస్టులతో రాష్ట్ర ప్రభుత్వం జరిపిన చర్చలు బాగున్నాయని మావోయిస్టులు అన్నారు. ఈ ప్రభుత్వ లొంగుబాటు పాలసీ బాగుందని సీఎంకు మావోయిస్టు అగ్రనేత దేవ్‌జీ తెలిపారు. తమ భవిష్యత్ ప్రణాళికలపై సీఎం రేవంత్‌రెడ్డికి మావోయిస్టు అగ్రనాయకులు వివరించారు.

# జూబ్లీహిల్స్‌లో ఫ్లై ఓవర్ పనులు ప్రారభం

(మొదటి పేజీ తరువాయి)

సీపీ సజ్జనార్ మీడియాతో మాట్లాడారు. ఇందులో భాగంగా కేబీఆర్ పార్క్ చుట్టూ ఏడు ఫ్లై ఓవర్ , ఏడు అండర్ పాసుల నిర్మాణం జరుగుతోందని తెలిపారు. ఈ రోజు పనులు మొదలయ్యాయని పేర్కొన్నారు. ఇవాళ నుంచి నిర్మాణ పనుల కారణంగా ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని సీపీ సజ్జనార్ చెప్పుకొచ్చారు. ఇప్పటికే వాహనదారులకు పలు సూచనలు చేశామని అన్నారు. రెండు సంవత్సరాల్లో నిర్మాణ పనులు పూర్తి చేయాలని ప్లాన్ చేశామని తెలిపారు. నిర్మాణ సమయంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా ఎలాన్ చేశామని చెప్పుకొచ్చారు.ఫ్లై ఓవర్ నిర్మాణ సమయంలో ప్రజలు సహకరించాలని కోరారు. వివిధ ప్రాంతాల్లో నిర్మాణ పనులు దశల వారీగా జరుగుతాయని వెల్లడించారు. రాత్రి వేళ ఎక్కువగా పనులు చేయాలని నిర్మాణ సంస్థలను కోరామని అన్నారు. బేస్‌మెంట్ పూర్తి అయితే తర్వాత ట్రాఫిక్ ఆంక్షలు సవరించే అవకాశం ఉంటుందని తెలిపారు. 7 అండర్ పాసులు, 7 ఫ్లై ఓవర్ అందుబాటులోకి వస్తే ఆయా రోడ్లు సిగ్నల్ ఫ్రీగా మారుతాయని హైదరాబాద్ సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. బీఆర్ పార్కు చుట్టూ 7 ఫ్లై ఓవర్లు, ఏడు అండర్ పాసుల నిర్మాణం ప్రారంభమైందని హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ తెలిపారు.

# నేటి నుంచి హెచ్‌పీవీ వ్యాక్సినేషన్

(మొదటి పేజీ తరువాయి)

దామోదర్ రాజనర్సింహ ప్రారంభించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 4లక్షల మంది బాలికలకు వ్యాక్సిన్ ఇవ్వనున్నారు.

# రాష్ట్రంలో కేన్సర్ నివారణ దిశగా మరో ముందడుగు

**హైదరాబాద్,ఫిబ్రవరి 27(పీసీడబ్ల్యూ న్యూస్):** సర్వైకల్ కేన్సర్ నివారణెళి లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా నేటి నుంచి హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ చేపట్టనున్నారు. కింగ్ కోఠి డిస్ట్రిక్ట్ హాస్పిటల్‌లో శనివారం ఉదయం 11 గంటలకు వ్యాక్సినేషన్ పంపిణీ కార్యక్రమాన్ని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రారంభించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 4 లక్షల మంది బాలికలకు వ్యాక్సిన్ ఇవ్వనున్నట్లు ఆరోగ్యశాఖ తెలిపింది.

# రాష్ట్రంలో కాంగ్రెస్ ఉన్నా..నడిగడ్డ బిఆర్ఎస్ వెనకే...

(మొదటి పేజీ తరువాయి)

నాగర్‌కర్నూల్‌లో రెండు నెలల పాప మరణ ఘటన, కోదాడలో దళిత యువకుడు కర్ల రాజేష్ లాకప్ డెత్ వంటి ఘటనలు ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. ఖమ్మం వెలుగుమట్లలో ఇళ్ల కూల్చివేతలు ప్రజలను రోడ్డున పడేసిన దారుణ చర్యలని ఆక్షేపించారు. కేసీఆర్ నాయకత్వంలో గతంలో అభివృద్ధి, సంక్షేమం రెండు జోడెడ్లలా ముందుకు సాగాయని, కానీ ప్రస్తుతం రాష్ట్రంలో అవినీతి, అరాచకం జోడెడ్లుగా మారాయని విమర్శించారు. చెక్ డ్యామ్‌లు పేల్చడం, ప్లలె ప్రకృతి వనాల్లో చెట్ల నరుకులు వంటి చర్యలు రాష్ట్రాన్ని వెనక్కి నెడుతున్నాయని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని, రైతు బంధు, ఎరువుల సరఫరా వంటి అంశాల్లో రైతులను తీవ్రంగా నిరాశపరిచిందని పేర్కొన్నారు. ప్రజలకు ఇప్పుడు కాంగ్రెస్ నిజ స్వరూపం అర్థమైందన్నారు.ఎమ్మెల్సీ చల్ల వెంకట్రామి రెడ్డి ప్రజల సమస్యలపై అంకితభావంతో పనిచేసే నాయకుడని, ఎమ్మెల్యే విజయుడు కూడా అదే తత్వాన్ని కొనసాగిస్తున్నారని ప్రశంసించారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లను ప్రలోభాలకు గురిచేసే ప్రయత్నాలు చేస్తుందని ముందుగానే హెచ్చరించిన కేటీఆర్, పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మరోసారి కేసీఆర్ నాయకత్వంలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# న్యాయవ్యవస్థపై పెట్టుకున్న నమ్మకం నిలబడింది

(మొదటి పేజీ తరువాయి)

ఇది కేవలం రాజకీయ కక్షతో పెట్టిన కేసు అని ఎన్నోసార్లు చెప్పాను. అదే నిజమైంది. దీంతో నేను, నా కుటుంబం కొన్ని నెలలపాటు క్షోభ అనుభవించాం. విపక్షాలను వేధించేందుకు దర్యాప్తు సంస్థలను వాడుకుంటున్నారు. కోర్టు తీర్పు రాకుండానే నాపై కొందరు అనుచితంగా మాట్లాడారు. కష్ట సమయంలో అండగా నిలిచిన అందరికీ ధన్యవాదాలు. మరింత ఉత్సాహంతో ప్రజలకు సేవ చేస్తాను అని కవిత అన్నారు. కోర్టు తీర్పు వెలువడిన అనంతరం 'సత్యమేవ జయతే' అని 'ఎక్స్'లో ఆమె పోస్ట్ చేశారు. ఢిల్లీ లిక్కర్ కేసులో రౌస్ అవెన్యూ కోర్టు కీలక తీర్పు వెల్లడించింది. లిక్కర్ పాలసీ అవినీతి కేసులో సరైన ఆధారాలు లేవని వ్యాఖ్యలు చేసింది. సీబీఐ సరైన మెటీరియల్ లేకుండా కేసులో ఇరికించిందని కోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. భారీ ఛార్జ్‌షీట్‌లో అనేక లోపాలు ఉన్నాయని, వాటికి సాక్షులు లేదా స్టేట్‌మెంట్ల మద్దతు లేదని స్పష్టం చేసింది. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు భారీ ఊరట లభించింది. కవితకు క్లీన్ చీట్ ఇచ్చింది రౌస్ అవెన్యూ కోర్టు కవితపై సీబీఐ నమోదు చేసిన అభియోగాలన్నిటిని కొట్టివేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు సీబీఐ ప్రత్యేక కోర్టు జడ్జి జితేందర్ సింగ్. అరవింద్ కేజ్రీవాల్, సిసోడియాతో పాటు కవితకు క్లీన్ చిట్ ఇచ్చింది. లిక్కర్ కేసులో ఐదు నెలల పాటు కవిత జైల్లో ఉన్నారు. లిక్కర్ కేసులో కోర్టు తీర్పుపై కవిత స్పందించారు. కవిత మాట్లాడుతూ.. నిజం గెలిచింది.. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసు నుంచి కడిగిన ముత్యంలా బయటకు వచ్చా.. నా తల్లిదండ్రులు, అత్తామామలు మాకు అండగా నిలిచారు.. కేసీఆర్, బీఆర్ఎస్‌ని టార్గెట్ చేయడానికే ఈ కేసు పెట్టారు.. నన్ను మూడేళ్ల పాటు నానా మాటలు అన్నారు.. సోషల్ మీడియాలో ట్రోల్స్ చేశారు.. రాజకీయ కుట్రతోనే ఈ కేసు పెట్టారని నిరూపితమైంది.. నాకు అండగా నిలిచిన వారిని మరిచిపోను అంటూ కవిత భావోద్వేగానికి గురైంది.


# మెడికల్ సీట్ల పేరుతో వందమందికి మోసం

● ఇద్దరు కేటుగాళ్లను అరెస్ట్ చేసిన పోలీసులు

**హైదరాబాద్,ఫిబ్రవరి 27(పీసీడబ్ల్యూ న్యూస్):** మెడికల్ సీట్లు ఇప్పిస్తామని చెప్పి దాదాపు 40 లక్షల రూపాయలు మోసం చేసిన ఘటన కుత్బుల్లాపూర్, పేట్ బాషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. శుక్రవారం మోసానికి పాల్పడిన ఇద్దరు కేటుగాళ్లను పేట్ బాషీరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. జీడిమెట్ల విలేజ్ లోని ఓ బాధితుని ఫిర్యాదు ఆధారంగా ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్టు ఎస్.హెచ్ఓ తెలిపారు. ఈ కేసులో ఇద్దరు నిందితులు అర్వింద్ రావు(40), న్యూఢిల్లీ, వెంకటరావు(58) హైదరాబాద్ లో అరెస్ట్ చేశారు. దేశవ్యాప్తంగా నీట్ ర్యాంకులు సాధించిన విద్యార్థులే టార్గెట్ గా దాదాపు 100 మందిని మోసం చేసినట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. దాదాపు 2 కోట్ల50 లక్షలకు పైగా మోసం చేసినట్టు పోలీసుల వెల్లడించారు. నిందితుల నుంచి నకిలీ అలాట్‌మెంట్ లెటర్స్, ఐడీలు, నకిలీ ఒప్పందపత్రాలు, 4 మొబైల్స్ స్వాధీనం చేసుకున్నట్లు ఈ సందర్భంగా పోలీసులు తెలిపారు.

# చిలకూరు పూర్వ ప్రధానార్చకులు సౌందర్ రాజన్ కన్నుమూత

● మృతికి పలువురు ప్రముఖులు సంతాపం



**హైదరాబాద్,ఫిబ్రవరి 27(పీసీడబ్ల్యూ న్యూస్):** చిలుకూరు బాలాజీ ఆలయ పూర్వ ప్రధాన అర్చకుడు సౌందర్ రాజన్ (90) కన్నుమూశారు. గత కొన్నాళ్లుగా వృద్ధాప్య సమస్యల కారణంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన.. శుక్రవారం చిలుకూరులోని నివాసంలో కన్నుమూశారు. ఈ మేరకు ఆయన తనయుడు, ఆలయ ప్రస్తుత ప్రధాన అర్చకుడు రంగరాజన్ వెల్లడించారు. హైదరాబాద్‌లోని ఈ ప్రసిద్ధ ఆలయాన్ని సౌందర్ రాజన్ ఎంతో కాలం క్రమశిక్షణతో, సేవానిరతితో నిర్వహించారు. భక్తులతో మమేకమై స్వామి వారి ప్రసాదాన్ని, సేవా విధానాన్ని ఎంతో ప్రశాంతంగా వివరించేవారు. వీసా దేవుడిగా చిలుకూరి ఆలయాన్ని ఆయన ప్రసిద్ధి పొందేలా చేశారు. ఇక్కడ భక్తులందరికీ ఒకేతరహా దర్శనంతో అవకాశ కల్పించారు. హుండీ లేకుండా చేశారు. భక్తులు నేరుగా దర్శనం కలిగించుకునేలా ఆలయాన్ని తీర్చిదిద్దారు. అలాగే ఆలయాన్ని స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వం ప్రయత్నించినా కోర్టుల ద్వారా దివంగత సౌందర్ రాజన్ పోరాడి అడ్డుకున్నారు. ఇకపోతే సౌందర్ రాజన్ ఉస్మానియా విశ్విద్యాలంయంలో కామర్స్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. సుదీర్ఘ కాలం ప్రొఫెసర్‌గా, తరవాత ఆయన ఉస్మానియా వర్సిటీ రిజిస్ట్రార్‌గా కూడా పనిచేసి రిటైర్ అయ్యారు. తరవాత వంశపారంపర్య ఆలయ అర్చకవృత్తిలో స్థిరపడ్డారు. ఆయన మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు. సమాచారశాఖ మాజీ కమిషనర్ కెవి రమణాచారి, తెలంగాణ శ్రీవైష్ణవసంఘం ప్రతినిధులు కూడా సంతాపం తెలిపారు.

# "ఉపాధ్యాయులకు వేతనాలు ఎక్కువ" అనే వాఖ్యం అనుచితం

**తీవ్రంగా ఖండిస్తున్నాము: పి.ఆర్.టి యూ.టి.ఎస్ మండలం అధ్యక్షులు సుదర్శన్**



అచ్చ సుదర్శన్ అధ్యక్షులు కటుకోజ్వల సతీష్ ప్రధాన కార్యదర్శి

**నడికూడ, ఫిబ్రవరి 27(పీసీడబ్ల్యూ న్యూస్):** విద్యా కమిషన్ రాష్ట్ర ప్రభుత్వంకు అందించిన ఎడ్యుకేషన్ పాలసీ పర్ తెలంగాణ, 2026 సుదీర్ఘ రిపోర్టులో ఉపాధ్యాయులకు వేతనాలు మార్కెట్ ప్రమాణాలతో పోలిస్తే ఎక్కువగా ఉన్నాయి అనే వ్యాఖ్యానం పూర్తిగా అనుచితమైనది మరియు వాస్తవాలకు విరుద్ధమైనది అని పి ఆర్ టి యూ టి ఎస్ నడికూడ మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి లు అచ్చ సుదర్శన్, కటుకోజ్వల సతీష్ ఖండించారు.వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించే వ్యక్తులు. భవిష్యత్ తరాలను తీర్చిదిద్దే బాధ్యత వారి భుజాలపై ఉంటుంది. అలాంటి మహత్తర సేవ చేస్తున్న ఉపాధ్యాయుల జీతాలను "ఎక్కువ" గా పేర్కొనడం వారి కృషిని తక్కువ చేసి చూపించే ప్రయత్నమే అవుతుందని అన్నారు.జీతాలు అనేవి సాధారణంగా ధరల పెరుగుదల (ద్రవ్యోల్బణం)కు అనుగుణంగా సవరించబడతాయి. నిత్యావసర వస్తువుల ధరలు, ఇంధన వ్యయం, గృహ వసతి ఖర్చులు వంటి అంశాలు పెరుగుతున్నప్పుడు ఉద్యోగుల జీవన వ్యయం కూడా పెరుగుతుంది.సరైన వేతనం ఇవ్వడం అనేది ఖర్చు కాదు అది దేశ భవిష్యత్తులో పెట్టుబడి.సరైన మరియు గౌరవప్రదమైన జీతభత్యాలు ఉన్నప్పుడే నిష్ణాతులు, ప్రతిభావంతులు, తెలివైన యువత ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకునే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. ఉపాధ్యాయులకు పదోన్నతులు సీనియారిటీ ద్వారా కాకుండా పారామీటర్ల ద్వారా అనడం అర్థరహితం.....అవగాహన రాహిత్యం.... సర్వీస్ రూల్స్‌కు పూర్తిగా వ్యతిరేకందాదాపు నియామ కం అయిన కేడర్ లోనో లేక దాదాపు రెండు దశాబ్దా లు (సుమారు 20 సం రాలకు కూడా రాని పదోన్నతి )సర్వీస్ చేస్తే కానీ పదోన్నతి రాని ఉపాధ్యాయులకు పదోన్నతి సీనియారిటీ కాకుండా పారామీటర్ ల ఆధారంగా పదోన్నతి అనేదానిని పి ఆర్ టి యూ టి ఎస్ నడికూడ మండల శాఖ వ్యతిరేకిస్తుందన్నారు.

# నడికుడలో జోరుగా మద్యం సిండికేట్

**అధిక ధరలకు బెల్టుకు విక్రయాలు**

**పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు**

**నడికూడ, ఫిబ్రవరి 27(పీసీడబ్ల్యూ న్యూస్):** నడికుడ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ లైసెన్స్ గల మద్యం షాపులో సిండికేట్ గా ఏర్పాటు చేసుకుని అధిక ధరలకు గ్రామాలలోని బెల్ట్ షాపులకు విక్రయాలు సాగిస్తున్నారు.ఈ మధ్యాన్ని గ్రామాలకు ఆటోల ద్వారా మద్యం రవాణా జరుగుతుండడం గ్రామాల్లోని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇంత దర్జాగా మద్యం అక్రమ రవాణా జరుగుతున్నా సంబంధిత అధికారులు గ్రామాల్లోని బెల్ట్ షాప్ లపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం, అధికారులు మామూళ్ల మత్తులో ఉండి పట్టించుకోవడం లేదని గ్రామంలో పలువురు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపులను ప్రభుత్వం నిషేధించినా వాడకో బెల్ట్ షాపు లెక్కన పుట్టుకొస్తున్నాయి.అధికారులు నామమాత్రంగా తనిఖీ లు నిర్వహించడం జరుగుతుంది.వైన్ షాప్ లో ఒక క్వార్టర్ కు 10 నుండి 20 రూపాయల వరకు బెల్టుకు విక్రయిస్తే గ్రామాల్లో బెల్ట్ షాప్ లో మరింత ధర పెంచి అమ్మడంతో గ్రామాల్లో సాధారణ, మధ్యతరగతి కుటుంబాల జీవన పరిస్థితి అస్తవ్యస్తంగా మారుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో బెల్ట్ షాప్ లో మద్యం అందుబాటులో ఉండడంతో ఎక్కువ ధరకు అయినా కొనుగోలు చేసి సేవిస్తున్నారని, రోజంతా పనిచేసే వచ్చే కూలీ డబ్బులు అందులో సగం బెల్ట్ షాపులోనే ఖర్చుపెట్టి ఇంటికి వెళ్లాల్సి వస్తుంది. అంతేకాకుండా గ్రామాల్లో బెల్ట్ లు అందుబాటులో మద్యం దొరకడం యువత కూడా వ్యసనాలకు గురవుతూ పెడదారి పడుతున్నారు.కొన్ని గ్రామాల్లో కొన్ని బెల్ట్ షాపుల్లో అర్ధరాత్రి వరకు అమ్మకాలు సాగిస్తున్నారని గ్రామాల్లో తెలుస్తుంది.ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు ఎవరూ పట్టించుకోవడంలేదని గ్రామాల్లో పలువురు ఆగ్రహం గురవడం జరుగుతుంది. మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డు లో ఉన్న వైన్స్ కు అటాచ్ గా మరొక కౌంటర్ ఏర్పాటు చేసుకొని అధిక ధరలకు బెల్ట్ కు విక్రయిస్తున్నారు. సంబంధిత అధికారులు గ్రామాల్లో బెల్ట్ షాపుల అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామాల్లో పలువురు కోరుతున్నారు.




# రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

**ట్రాఫిక్ నియమాలు పాటించండి**

**సురక్షిత ప్రయాణం గమ్యానికి చేరుస్తుంది: కల్లూరు ఏసిపి వసుంధర యాదవ్**






**పెనుబల్లి, ఫిబ్రవరి 27 (పిసిడబ్ల్యు న్యూస్) :** రోడ్డు భద్రత నియమాలపైన అవగాహన లోపం వల్ల రోడ్డు ప్రమాదాలు అధిక సంఖ్యలో జరుగుతున్నాయని కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ అన్నారు. వియం బంజర పోలీసుల ఆధ్వర్యంలో వీఆర్కే ఫంక్షన్ హాల్ అరైవ్ అలైవ్ రెండోవ విడత కార్యక్రమంలో వాహనదారులకు, ఆటో డ్రైవర్లకు, ప్రజలకు అవగాహన కల్పించారు. నిర్లక్ష్య డ్రైవింగ్, అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం లేకపోవడం వంటి కారణాల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటిస్తేనే ప్రమాదాలను తగ్గించవచ్చని అన్నారు. మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ వాహనం నడపడం ప్రమాదకరమన్నారు. సురక్షిత ప్రయాణం సంతోషకర గమ్యం అనే లక్ష్యంతో అందరూ కలిసి పని చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.అనంతరం రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ వాహనాలు నడుపుతూ ప్రమాదాల నివారణకు కృషి చేస్తానని ప్రతిజ్ఞ చేశారు.కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ మత్తులింగం, ఎస్సై వెంకటేష్, కవిత పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధిలో సర్పంచ్లదే కీలక పాత్ర మహిళా సర్పంచ్లు ముందుండాలి

**కేసముద్రంలో ఎమ్మెల్యే డా. భూక్యా మురళీనాయక్ కీలక సూచనలు**








**మహబూబాబాద్, ప్రతినిధి ఫిబ్రవరి 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** గ్రామాల సమగ్ర అభివృద్ధిలో సర్పంచ్ల పాత్ర అత్యంత కీలకమని డా. భూక్యా మురళీనాయక్ స్పష్టం చేశారు. మండలంలోని కేసముద్రం పట్టణ కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన మండలస్థాయి అధికారుల సమీక్ష సమావేశం, నూతన సర్పంచుల ముఖాముఖి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన సర్పంచ్లు తమ విధులు, అధికారాలపై పూర్తి అవగాహన పెంపొందించుకొని గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేయాలని సూచించారు. పార్టీలకతీతంగా గ్రామాభివృద్ధిని ముందుకు తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు.గత రెండేళ్లలో స్పెషల్ ఆఫీసర్ల పరిపాలనలో జరిగిన పనులపై సమీక్ష జరిపిన ఆయన, పనులు జరిగిన మేరకే నిధులు డ్రా చేయాలని, పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు ఆదేశించారు.ప్రత్యేకంగా మహిళా సర్పంచ్లకు మార్గనిర్దేశం చేస్తూ, "భార్యలు సర్పంచులైతే భర్తల పెత్తనం అస్సలు ఉండకూడదు. మహిళలే స్వయంగా కార్యాలయాలకు హాజరై బాధ్యతలు నిర్వర్తించాలి" అని స్పష్టం చేశారు. మండలంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు మహిళా సర్పంచులు స్వయంగా హాజరవుతున్నట్లు యితేనే పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు.వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, గ్రామ కార్యదర్శులుసర్పంచ్లు సమన్వయంతో పనిచేసి సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిపై కూడా సమీక్షించిన ఎమ్మెల్యే, మొదటి విడతలో మంజూరైనప్పటికీ ఇంకా ప్రారంభం కాని 52 ఇండ్ల నిర్మాణాలను రెండు మూడు రోజుల్లో తప్పనిసరిగా ప్రారంభించాలని అధికారులకు గడువు విధించారు.సమావేశానికి ముం దు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 49 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు, సర్పంచ్లు, ఉపసర్పంచ్లు, మాజీ ప్రజాప్రతి నిధులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ములుగు జిల్లా సివిల్ సప్లైస్ డీఎంగా కృష్ణవేణి సభ్యులు



**ములుగు, ఫిబ్రవరి 27(పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా సివిల్ సప్లైస్ డీఎంగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన శ్రీమతి కృష్ణవేణిని ములుగు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు నేడు ఆమె కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు బాధం ప్రవీణ్ పూలమొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం జిల్లాలోని రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలను డీఎం దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న మిల్లింగ్ చార్జీలను తక్షణమే విడుదల చేయాలని అసోసియేషన్ తరపున బాధం ప్రవీణ్ విజ్ఞప్తి చేశారు. దీనిపై డీఎం కృష్ణవేణి సానుకూలంగా స్పందిస్తూ సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఇదే సందర్భంలో బార్దాన్ (గన్నీ బ్యాగుల) లెక్కల సమస్యలు, ధాన్యం మిల్లింగ్‌కు సంబంధించిన పరిపాలనా ఇబ్బందులు, చెల్లింపుల ఆలస్యం, రవాణా మరియు నిల్వ సదుపాయాల లోపాలు వంటి అంశాలను కూడా ప్రతినిధులు వివరించారు.మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని డీఎం కృష్ణవేణి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ములుగు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి








**రేగొండ, ఫిబ్రవరి 27(పిసిడబ్ల్యూ న్యూస్):** రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం మండల కేంద్రంలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ములుగు మండలం అబ్బాపురం గ్రామా నికి చెందిన రాస ప్రభాకర్ (48) తన ద్విచక్ర వాహనము పై రేగొండ నుండి ములుగు వైపు వెళు తున్న గ్రామంలో ములుగు వైపు నుండి రేగొండకు వస్తున్న టీజీ 16 1414 నెంబర్ గల కియో కార్ జగ్గయ్యపేట మూలమలుపు వద్ద ఢీ కొట్టింది. ఈ సంఘటనలో ప్రభాకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య నిర్మల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పరకాల సివిల్ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. మృతునికి కూతురు, కొడుకు ఉన్నారు.

# ఘనంగా విజ్ఞాన్ పబ్లిక్ స్కూల్ 20వ వార్షికోత్సవం







**కమలాపూర్, ఫిబ్రవరి 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** కమలాపూర్ మండలంలోని శనిగరం గ్రామంలో ఉన్న విజ్ఞాన్ పబ్లిక్ స్కూల్ పాఠశాల స్థాపనకు 20 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా శుక్రవారం వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల ప్రతిభా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.కార్యక్రమానికి హాజరైన అతిథులు దీపప్రజ్వలనతో వేడుకలను ప్రారంభించారు. యూకేజీ చిన్నారుల గ్రూప్ డాన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచి, ప్రేక్షకులను అలరించింది. వివిధ తరగతుల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, గేయనాటికలతో తమ ప్రతిభను చాటుకున్నారు.ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ & ప్రిన్సిపాల్ ఐలా భాస్కర్ మాట్లాడుతూ, రెండు దశాబ్దాలుగా నాణ్యమైన విద్య అందిస్తూ పాఠశాల ముందంజలో నిలుస్తోందన్నారు. విద్యార్థుల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా బోధన సాగుతున్నదని తెలిపారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుమలత, కిరణ్, స్వప్న, కళ్యాణి, సురేఖ, రజిత, రవళి, అనిత తదితరులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో ముగిసింది.

# సీఎం సంకల్పంతోనే ఎస్సీ వర్గీకరణ అమలు

- మార్చి 6న హైదరాబాద్ శిల్పకళా వేదికలో సిఎం రేవంత్ రెడ్డికి మాదిగ ఉద్యోగుల సన్మానసభ
- సిఎం సన్మానసభ పోస్టర్ ఆవిష్కరణ




**ఖమ్మం ప్రతినిధి, ఫిబ్రవరి 27 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన వెనువెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి వర్గీకరణ చట్టాన్ని మొట్టమొదటిగా రాష్ట్రంలో అమలుచేస్తామని ప్రకటించడం అభినంద నీయం. ఇచ్చిన మాటకు కట్టుబడి ఎస్సీ వర్గీకరణను అమలుచేస్తున్న సందర్భాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలోని మాదిగ ఉద్యోగుల ఆధ్వర్యంలో మార్చి 6న హైదరాబాద్ శిల్పకళా వేదికలో జరుగనున్న ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి సన్మానసభను మాదిగ ఉద్యోగులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఖమ్మం నగరం జడ్పీ సెంటర్లోని అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం మాదిగ ఉద్యోగులు రేవంత్ రెడ్డి సన్మానసభ ప్రచార పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చిర్రా బాబురావు, కిరణ్ చక్రవర్తి, వి. చిన్నబాబురావు, చేకూరి రమేష్, సగ్గుర్తి రామారావు, పొనుగోటి రవి, పేరెల్లి శ్రీను, పొట్టపింజర నాగేశ్వరరావు, కుక్కల రామారావు, మరికంటి కన్నారావు, కుక్కల బాబురావు, తూరుగంటి దశరథ, కాంపాటి బిక్షపతి, సిహెచ్ వెంకన్న, పలిమల రమేష్, గురజాల నరేష్, యడెల్లి వెంకట్, పరిమళ రాము, గద్దల నాగరాజు, మాతంగి అనిల్, రవికుమార్, నాగరాజు, సైదులు, రాజేష్, సూర్యం తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి భూమి పూజ చేసిన సర్పంచ్ వెంకటేష్



**నడికూడ, ఫిబ్రవరి 27(పీసీడబ్ల్యూ న్యూస్):** మండలంలోని ముస్త్యాలపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి గ్రామ సర్పంచ్ మేకమల్ల వెంకటేష్ శుక్రవారం రోజున భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇండ్ల నిర్మాణ కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులు ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల మేరకు ఇండ్లు నిర్మించుకోవాలన్నారు. త్వరితగతిన ఇండ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి దొంతుల కరుణాదేవి ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సంత్ రవిదాస్ ఉద్యమ కవి, ఆధ్యాత్మికవేత్త, సామాజిక సంస్కర్త...

**కరీంనగర్,ఫిబ్రవరి27(పీసీడబ్ల్యూ న్యూస్):** సమరసతామూర్తుల క్యాలెండర్, సంత్ రవిదాస్ పుస్తకావిష్కరణ సందర్భంగా సామాజిక సమరసత బాధ్యులు రమేష్ రెడ్డి ,పుల్లూరి రామారావు,సంత్ రవిదాస్ 15-16వ శతాబ్దపు గొప్ప భక్తి ఉద్యమ కవి, ఆధ్యాత్మికవేత్త, సామాజిక సంస్కర్త అని సామాజిక సమరసత తెలంగాణ ప్రాంత బాధ్యులు పుల్లూరి రామారావు, కరీంనగర్ జిల్లా అధ్యక్షులు రమేష్ రెడ్డి కొనియాడారు.సంత్ రవిదాస్ 650వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని సమరసతామూర్తుల క్యాలెండర్, సంత్ రవిదాస్ యొక్క పుస్తకావిష్కరణ కార్యక్రమం శుక్రవారం రోజున కరీంనగర్లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ కాశీలో చర్మకారుల కుటుంబంలో జన్మించిన సంత్ రవిదాస్ ముఖ్యంగా కులం, మతం, లింగ బేధాలను వ్యతిరేకించారని, మనుషులందరూ సమానమని, తన భక్తి గీతాలు, అద్వైత బోధనలతో, భగవంతుడు ఒక్కడే అని సమానాత్వాన్ని బోధించారన్నారు. సంత్ రవిదాస్ రాసిన భజనలు, శ్లోకాలు, సిక్కుల పవిత్ర గ్రంథం గురు గ్రంద్ సాహిబ్ లో చోటు




చేసుకున్నాయన్నారు. భక్తితోనే దేవుణ్ణి చేరుకోవచ్చనీ సంత్ రవిదాస్ అనేక భక్తి గీతాలు, ఆధ్యాత్మిక కవిత్వం భక్తి ఉద్యమంలో కీలక పాత్ర పోషించాయని తెలిపారు. మనలోనే దేవుడు ఉన్నాడని ఆయన చాటి చెప్పారని, ఆయన బోధనలు నేటికీ ప్రజలను ప్రేరేపిస్తున్నాయన్నారు. రవితేజ జయంతిని మాఘ పౌర్ణమి రోజున ప్రతి సంవత్సరం ఘనంగా జరుపుకుంటున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సామాజిక సమరసత వేదిక జిల్లా అధ్యక్షులు రమేష్ రెడ్డితెలంగాణ ప్రాంత భాద్యులు పుల్లూరి రామారావు పురుషోత్తం



దావు సంతోష్ కుమార్, చంద్రగిరి సత్తయ్య, దొంతుల మల్లేశం, దొంతుల శ్రీనివాస్, దేవరకొండ సునీల్, సుందరగిరి సందీప్, దేవరకొండ నరేష్ బాబు,దేవరకొండ చంద్రమోహన్ అలిసేరి నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## చౌడేపల్లి మండలంలో క్షుద్ర పూజల కలకలం



**ఏపీ: అన్నమయ్య జిల్లా: పుంగనూరు: ఫిబ్రవరి 27 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** చౌడేపల్లి మండలంలోని ఆమినిగుంట పంచాయతీ పులికోన వంకలో క్షుద్ర పూజల కలకలం రేపింది. ప్రధాన రహదారి నుంచి గ్రామానికి వెళ్లే మార్గంలో గుర్తు తెలియని వ్యక్తులు పలు రకాల ముగ్గులతో, నిమ్మకాయలు కోసి ఎరుపురంగులో ముగ్గులు కనిపించడంతో గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. గత రెండు నెలల క్రితం చౌడేపల్లి మండలంలోని కాగితి గ్రామం వద్ద ప్రభుత్వ పాఠశాల వద్ద క్షుద్ర పూజల కలకాలం మరవకముందే మరో ఘటన వెలుగు చూడడంతో మండల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. క్షుద్ర పూజలతో గ్రామానికి అరిష్టం వాటిల్లే ప్రమాదం ఉందని పలువురు గ్రామస్తులు వాపోతున్నారు. ఇటీవల కాలంలో ఇలాంటి దృశ్యాలు కనిపిస్తుండడంతో పిల్లలు, వృద్దులు, తమ తమ ఇళ్ళ నుండి బయటకు రాకుండా బిక్కు బిక్కుమంటూ ఇళ్లలోనే ఉండాల్సి వస్తుందని గ్రామస్తులు తెలిపారు.

## కవితక్కకు ఢిల్లీ లిక్కర్స్ క్యాంప్ కేసులో క్లీన్ రావడం సంతోషంగా ఉంది: రాకేష్ గైక్వాడ్





**హైదరాబాద్ ఫిబ్రవరి 27(పిసిడబ్ల్యూ న్యూస్):** ఢిల్లీ లిక్కర్ కేసులో క్లీన్ చీట్ రావడం సంతోషంగా ఉందని హరి బోలీ డివిజన్ తెలంగాణ జాగృతి యువ నాయకులు రాకేష్ గైక్వాడ్ అన్నారు. న్యాయవ్యవస్థపై నమ్మకం పెట్టుకున్న నమ్మకమే గెలిపించిందని, కడిగిన ముత్యంలా బయటికి వస్తానని కవితక్క చెప్పిన విధంగానే క్లీన్ చీట్ రావడం ఎంతో సంతోషంగా ఉందని రాజకీయ కక్ష సాధింపులతో కేసులు పెట్టారని గతంలో పదేపదే కవితక్క తెలిపిన ఎంతోమంది విమర్శలు చేసిన పట్టించుకోలేదని, ఐదున్నర నెలలు జైల్లో పెట్టిన కుటుంబానికి దూరం చేసిన, తెలంగాణ ప్రజలకై పట్టు విడవకుండా ప్రజల పక్షాన నిలబడుతూ ప్రజా గొంతుకై ప్రశ్నిస్తున్న కవితక్కకు తెలంగాణ జనం నీరాజనం పడుతున్నారని, కవితక్కను విమర్శించిన నోర్లు ఇప్పుడు మూతపడతాయని ఈ సందర్భంగా రాకేష్ గైక్వాడ్ అన్నారు. కవితకు క్లీన్ చిట్ రావడంతో తెలంగాణ జాగృతి ఆఫీస్ వద్ద బాణా బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టి, రంగులు చల్లుకొని కవితక్క జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నవీన్ కుమార్, నవీన్ కుమార్, హర్ష, ఓంకార్, శ్రీకర్ రాజు, బబ్లు, నితిన్, భాను, సతీష్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## శోభాయమానం.. శ్యామ్ నిషాన్ యాత్ర





**హైదరాబాద్ ఫిబ్రవరి 27(పిసిడబ్ల్యూ న్యూస్):** రాధేశ్యామ్ నామస్మరణలు మార్మోగాయి. రంగురంగుల జెండాలతో సాగిన నిషాన్ యాత్రతో కాచిగూడ రైల్వే స్టేషన్ సమీపంలోని శ్యామ్ బాబా మందిర్ పరిసర ప్రాంతాల్లో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. కలియుగ కృష్ణుడిగా భావించే శ్యామ్ బాబా తన శిరస్సును శ్రీ కృష్ణుడికి దానమిచ్చిన రోజును పురస్కరించుకుని నిర్వహించే పాల్గున్ మహోత్సవం శుక్రవారం శ్యామ్ మందిర్ లో వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు శ్యామ్ మందిర్ లో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోశామ హల్ నుంచి కాచిగూడ శ్యామ్ మందిర్ వరకు భక్తులు ప్రత్యేక శోభాయాత్ర ర్యాలీ నిర్వహించారు. భజరంగ్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.ఆర్. లక్ష్మణ్ రావు ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాచిగూడ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదిక నుంచి భక్తులకు ఆయన స్వాగతం ఫలికారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వందల సంఖ్యలో భక్తులు రంగు రంగుల జెండాలతో నిషాన్ శోభాయాత్రలు నిర్వహించారు. గుర్రాలు, ప్రత్యేకంగా ఆలంకరి ంచిన వాహనాలతో యాత్రలో పాల్గొన్నారు. రథాలపై శ్రీకృష్ణుడి చిత్రపటాలుంచి ఊరేగించారు. ఈ ఊరేగింపునకు శ్యామ్ మందిర్ సేవా సమితి అధ్యక్షులు చంద్రకాంత్ డకోటియా, కార్యదర్శి ఇంద్రకరణ్ అగర్వాల్, రాందేవ్ అగర్వాల్, కృష్ణకుమార్ బడేగావ్వాలే, రాజ్ కుమార్ విగ్, కపిల్ అగర్వాల్లు స్వాగత వేదిక నుంచి ఘన స్వాగతం పలికారు. విజయ్, లాలు, చింటు, ఇషాన్, ఆనం ద్, కేశవ్, విషాల్ రవి, కిరణ్, శ్యామ్, హిమాన్షు, క్రిష్ణ, రాహుల్, శ్రావణ్, పవన్, తన్వీ, తదితర భక్తులు పాల్గొని శోభాయాత్రను విజయవంతంగా నిర్వహించారు. శ్యామ్ బాబా కు 56 రకాల మిఠా యిల నైవేద్యాన్ని సమర్పించారు. అలాగే శ్యామ్ బాబా విగ్రహాన్ని రకరకాల పూలు, పట్లతో అలంకరించారు.

# ఇందిరమ్మ రాజ్యమంటే ఇళ్లు కూల్చడమే నా...!

**భూదాన్ అక్రమార్కుల నిగ్గు తేల్చాలి**

**కమ్యూనిస్టుల చరిత్ర యూట్యూబ్ వెబ్ పెయిడ్ బ్యాచ్‌కి ఏం తెలుసు..?**

**వామపక్షాల పోరాట ఫలితంగానే ఖమ్మంలో కాలనీల ఏర్పాటు..!**

**నిర్వాసితులకు తక్షణ సహాయం కింద లక్ష రూపాయలు ప్రకటించాలి**

**ఇళ్లు కోల్పోయిన వారందరికీ న్యాయం చేయాలి**

**విలేకర్ల సమావేశంలో వామపక్షపార్టీల నేతలు నున్నా నాగేశ్వరరావు, దండి సురేష్, ఆవునూరి మధు, గోకినేపల్లి వెంకటేశ్వర్లు**




**ఖమ్మం ప్రతినిధి, ఫిబ్రవరి 27 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఇందిరమ్మ రాజ్యం అంటే కూలీ పనులు చేసుకుంటూ గూడు ఏర్పరుచుకున్న నిరుపేదల ఇళ్లను కూల్చి వారిని మెడ పట్టి గెంటి వేయడమే ఇందిరమ్మ రాజ్యమా.. అని పలువురు వామపక్ష నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు..ఇళ్ళ కూల్చి వేత సందర్భంగా ఎటువంటి నోటిసులు లేకుండా వారి సామాన్లు కూడా తీసుకోనివ్వకుండా 2వేల మంది పోలీసులను, వందలాది మంది అధికారులను ఏర్పాటుచేసి తెల్లవారు జామునుంచే కూల్చి వేయడం గాజాపై ఇజ్రాయిల్ చేసిన దమన కాండను గుర్తు చేసిందన్నారు. ఖమ్మం నగరంలోని సిపిఎం జిల్లా కార్యాలయం సుందరయ్య భవన్ లో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని వెలుగుమట్ల ప్రాంతంలో గల భూదాన్ భూముల్లో గత 10 సంవత్సరాల క్రితం నుంచి నిరుపేదలు పట్టాలు పొంది 600మంది నివసిస్తు న్నారని తెలిపారు. వారి అందరి ఇళ్లు కూల్చి వేయడం వల్ల వారు రోడ్డున పడ్డారని, విద్యార్థులు ప్రస్తుతం జరుగుతున్న పరీక్షలు కూడా రాయ లేదన్నారు. 2014 నుంచి బడా బాబుల భూములను క్రమబద్ధీకరణ చేస్తున్న ప్రభుత్వం, పేదల ఇళ్లను ఎందుకు క్రమబద్ధీకరించడం లేదని ధ్వజమెత్తారు.ఖమ్మం వెలుగుమట్ల భూదాన్ భూముల్లో ఆక్రమణలు చోటు చేసుకున్నాయనే అక్కడ వున్న నిరుపేదల ఇళ్లను కూల్చివేశామని చెప్పుకుంటున్న ప్రభుత్వం వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని ప్రశ్నించారు. మొత్తం 62 ఎకరాలలోని 32 ఎకరాలలో ఇళ్ళను కూల్చి 250 కోట్ల ఆస్తిని స్వాదీనం చేసుకొన్నామని గొప్పలు చెప్పుకుంటున్న వారు మిగతా స్థలం ఏమైనదో నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. నిరు పేదలు ఆక్రమణ దారులు కాదని, కూలీ పనులు చేసుకుని అప్పులు తెచ్చుకొని ఇళ్లు నిర్మించుకునే వారన్నారు. అటువంటి వారి ఇళ్లను కూల్చివేసి ప్రభుత్వ ఆస్తిని కాపాడమని అధికారులు చెప్పడం సిగ్గు చేటన్నారు. జిల్లా కలెక్టర్ ప్రజల అధికారా లేక రియల్ ఎస్టేట్ వ్యాపార అని ప్రశ్నించారు. ఆయన సంఘటన పై చెప్పిన వివరాలను పరిశీలిస్తే ఆ భూమిని ప్రభుత్వం బడా బాబులకు కట్టబెట్టే యోచనలో ఉన్నట్లు అనుమానాలు తలెత్తుతున్నాయని ఆరోపించారు. జిల్లా యంత్రాంగం నిస్పక్షపాతంగా వ్యవహరించి నిర్వాసితులకు న్యాయం చేయాలని, ప్రభుత్వ నిర్వాహకం వల్ల నిర్వాసితులు సర్వస్వం కోల్పోయి తినడానికి తిండి కూడా దొరకక అల్లాడుతున్నా రని, వారికి తక్షణ సాయంగా లక్షరూపాయలు అందించాలని, ఇళ్లు కోల్పోయిన ప్రతీ ఒక్కరికీ అదే స్థలంలో ఇళు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. **కమ్యూనిస్టుల చరిత్ర పిల్లకాకులకు ఎం తెలుసు** తెలంగాణ సాయుధ పోరాటం లాంటి ముదిగొండ భూపోరాటం వంటి మహోత్తర పోరాటాల ద్వారా పేదలకు ఇళ్లు, స్థలాలు, భూములు సాధించినటువంటి కమ్యూనిస్టు పార్టీల చరిత్ర యూ ట్యూబ్ వెబ్ పెయిడ్ బ్యాచ్ కు ఏం తెలుస్తుందని వామ పక్షనేతలు మండి పడ్డారు. వామపక్షాల పోరాటాలు లేకుండా వాళ్ళు మరణించకుండా, దెబ్బలు తినకుండా, నిర్బందింప పడకుండా ఖమ్మం నగరంలో పేదలు నివసించే రామనగుట్ట, దానవాయిగూడెం, రామన్నపేట, అగ్రహారం, దంసలాపురం, వైఎస్ఆర్ కాలనీ వంటి కాలనీలు ఏర్పడలేదని తెలిపారు. ఇందిరమ్మ పథకం కూడా తమ పోరాటాల వల్లనే వచ్చిందన్నారు. అటువంటి వామపక్ష పార్టీలపై యూట్యూబ్, వెబ్ ఛానల్, ఎల్లో జర్నలిస్టులు కొంత మంది కారుకూతలు తమ మాధ్యమాల ద్వారా ప్రచారం చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. చరిత్ర తెలియకపోతే తెలుసుకొని ప్రచారం చేయాలని, అంతేకాని ప్యాకేజీ లు తీసుకొని జర్నలిజం విలువలు దిగజార్చ వద్దన్నారు. లేనియెడల ప్రజలే తగిన గుణపాఠం జేబుతారన్నారు. **ఇందిరమ్మ రాజ్యం అంటే ఇదేనా** పేదప్రజల ఇళు నిర్మించి ఇస్తాం..మాది ఇందిరమ్మ రాజ్యం అంటూ ప్రభాల్గాలు పలికే జిల్లా మంత్రులు సంఘటన పై ఎందుకు మౌనంగా ఉన్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రులు నిర్వాసితుల పక్షాన నిలిచి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు వారు ఎన్ని అడ్డంకులు సృష్టించినా, ఎటువంటి చర్యలు తీసుకున్నా నిర్వాసితులకు తాము అండగా ఉంటామని స్పష్టం చేశారు. సమావేశంలో ఆయా పార్టీల రాష్ట్ర, జిల్లా, నగర నాయకులు వై.విక్రం, మేకల శ్రీనివాస్, ఆవుల అశోక్, పాముల మోహన్, రాజు, జి.మస్తాన్, శంకర్, శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.

# ఇండ్లు కట్టడంలో మోదీ పోటీ పడుతుంటే.... పేదల ఇండ్లను కూల్చడంలో రేవంత్ రెడ్డి పోటీ పడుతున్నారు

**కూల్చివేతలు తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం సాధించిందేమిటి?**

**రేవంత్ తీరు మారకపోతే రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రజలే కూల్చేస్తారు**

**ఎన్నికల ముందు హామీలిచ్చి వాటిని ఎగ్గొట్టడంలో కేసీఆర్ ను మించి పోయారు**

**మున్సిపల్ ఎన్నికలైపోగానే 'రైతు భరోసా' వేస్తామన్నారు కదా?**

**ఇంతవరకు రైతుల ఖాతాలో ఎందుకు జమ చేయలేదు**

**రైతు భరోసా మూడు వాయిదాల పేరుతో రైతులకు రూ.27 వేల కోట్లు బాకీ పడ్డారు**

**ఇచ్చిన హామీలు అమలు చేయకపోయినా కాంగ్రెస్ కు ఓట్లేసి ప్రజలు పొరపాటు చేశారు**

**రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ కు కర్రుకాల్చి వాతపెడితేనే బుద్ది వస్తుంది**

**కాంగ్రెస్, మజ్లిస్ ఒక్కటే...పైకి డ్రామాలాడుతున్నయి**

**ముస్లిం అంటే కాంగ్రెస్... కాంగ్రెస్ అంటే ముస్లిం అని సీఎం చెప్పారు కదా**

**మరి ఒవైసీ, రేవంత్ రెడ్డిలకు ఎక్కడ చెడిందో చెప్పాలి**

**కాళేశ్వరం అవినీతిపై విచారణ జరిపించే దమ్ము కాంగ్రెస్ కు లేదని లేఖ రాయండి**

**అప్పుడు కాళేశ్వరం అంశాన్ని కేంద్రం చూసుకుంటుంది**

**కరీంనగర్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ హాట్ కామెంట్స్...**

**51వ డివిజన్‌లో వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించిన కేంద్ర మంత్రి**





**కరీంనగర్ టౌన్ ఫిబ్రవరి 27(పిసిడబ్ల్యూ న్యూస్):** "ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా 4 కోట్ల ఇండ్లు నిర్మించింది. మోదీ పేదలందరికీ ఇండ్లు నిర్మించి ఇచ్చే విషయంలో పోటీ పడుతుంటే... కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇండ్లను కూల్చే విషయంలో పోటీ పడుతోంది."అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ విమర్శించారు. నానా కష్టాలు పేదలు అప్పోసప్పో చేసి బతకడానికి ఇండ్లు కట్టుకుంటే వాటిని కూల్చడం దుర్మార్గమని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి పనితీరు మారకపోతే...రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రజలే కూల్చివేస్తారని చెప్పారు. తక్షణమే పేదల ఇళ్ల కూల్చివేతను ఆపాలని, లేనిపక్షంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈరోజు కరీంనగర్ లోని 51వ డివిజన్ లో రూ.16 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులను ప్రారంభించారు. మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, స్థానిక కార్పొరేటర్ భండారి వేణుసహా పలువురు నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. ఏమన్నారంటే... కరీంనగర్ లోని 51వ డివిజన్ లో రూ.16 లక్షల నిధులతో అభివృద్ది పనులను చేపట్టాం. ఈ డివిజన్ లో వర్షం వస్తే ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఆ నిధులతో డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్నం. స్థానిక కార్పొరేటర్ భండారి వేణును భారీ మెజారిటీ గెలిపించి నమ్మకం ఉంచి ప్రజలకు ధన్యవాదాలు చెబుతున్నా. ఇచ్చిన మాట ప్రకారం కేంద్రం నుండి పెద్ద ఎత్తు నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తా. అట్లాగే రాష్ట్ర ప్రభుత్వం నుండి రావాల్సిన నిధులను కాంగ్రెస్ పెద్దలపై ఒత్తిడి తెచ్చి తీసుకొస్తా. రాజకీయాలకు తావివ్వకుండా అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తా. ఇతర పార్టీల నేతలకు కూడా విజప్తి చేస్తున్నా. కలిసి కట్టుగా పనిచేస్తూ నిధులు తీసుకొచ్చి కరీంనగర్ ను ఆదర్శంగా అభివృద్ధి చేస్తాం. ప్రజలు అభివృద్ధి కోరుకుంటున్నారే తప్ప రాజకీయ విమర్శలను పట్టించుకోరని విషయాన్ని గుర్తు చేసుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం "రైతు భరోసా" ఇవ్వడం లేదు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట తప్పారు. మున్సిపల్ ఎన్నికలు ముగిసిన వెంటనే రైతు భరోసా వేస్తామని ఫిబ్రవరి 4న మిర్యాలగూడలో రేవంత్ రెడ్డే ప్రకటించారు. ఇట్లాంటి హామీలు చాలా ఇచ్చారు. మాట తప్పారు. వాస్తవానికి ముఖ్యమంత్రి నోటి నుండి ఏ మాట వచ్చినా శాసనం కావాలి. కానీ రేవంత్ రెడ్డి, ఆయన మంత్రులు కేసీఆర్ దగ్గర ట్రైనింగ్ తీసుకుంటున్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయరు. నమ్మించి ఓట్లేయించుకుని మోసం చేస్తారు. రైతు భరోసా ఇస్తామని చెప్పి, రూ.9 వేల కోట్లు రడీగా ఉన్నాయని పదేపదే చెబుతూ వార్తలు రాయించుకున్నారు. కానీ ఇంతవరకు ఆ ఊసే లేదు. అధికారంలోకి వచ్చాక రైతు భరోసా ఒక దఫా ఎగ్గొట్టారు. ఎన్నికలొస్తే ఏదో ఒక హామీని తూతూ మంత్రంగా అమలు చేసినట్లు నటించి వార్తలు రాయించుకోవడం... ఆ ఎన్నికలైపోగానే వాటిని మర్చిపోవడం వాళ్లకు అలవాటైంది. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలొచ్చే టైంలో మళ్లీ ఏదో ఒక డ్రామాలాడతారు. రాష్ట్ర ప్రజలు మున్సిపల్ ఎన్నికల్లో 6 గ్యారంటీలను అమలు చేయకపోయినా, డీఏలు, ఫీజు రీయంబర్స్ మెంట్, ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించకపోయినా ఓట్లేశారు. దీంతో కాంగ్రెస్ నేతల్లో అహంకారం పెరిగిపోయింది. ఏ హామీని అమలు చేయకపోయినా ఓట్లేస్తున్నారని చెబుతున్నారు. అందుకే ఈసారి ప్రజలంతా కాంగ్రెస్ కు కర్రు కాల్చి వాత పెట్టాలి. రైతు భరోసా గురించి కేబినెట్ లో ఎందుకు చర్చించలేదు. ఆ పైసలు రైతుల ఖాతాల్లో వేసే ఆలోచన సీఎంకు లేదు. మూడు రైతు భరోసా వాయిదాలు కలిపితే రూ.27 వేల కోట్లు ఇవ్వాలి. కానీ ఇవ్వరు. మహా అంటే ఒక రైతు భరోసా వాయిదాను చెల్లించి మిగితావి చెల్లించకుండా మోసం చేయాలని చూస్తున్నారు. ప్రజలు తెలివైన వాళ్లు. తక్షణమే రైతు భరోసాను చెల్లించాలని కోరుతూ ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రికి లేఖ రాసిన. తక్షణమే రైతు భరోసా చెల్లించకపోతే బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరిస్తున్నా. రాష్ట్ర ప్రభుత్వం కూల్చివేతలు తప్ప సాధించింది ఏముంది? నానా కష్టాలుపడి పేదలు ఇండ్లు కట్టుకున్నరు. పోనీ ఇల్లు కట్టేటప్పుడు అధికారులు ఎందుకు అభ్యంతరం చెప్పలేదు? అప్పోసప్పో చేసి బతకడానికి చిన్ని ఇల్లు కట్టుకుంటే ఆ పేదల ఇండ్లను కూల్చడానికి మీకు మనసెలా వచ్చింది? పేదలు ఇండ్లు కట్టుకోవద్దా? ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద దేశవ్యాప్తంగా 4 కోట్ల ఇండ్లు కట్టించినం. మోదీ ప్రభుత్వం పేదలకు ఇండ్లు కట్టడానికి ముందుకు వస్తుంటే.... కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పేదల ఇండ్లను కూల్చే విషయంలో పోటీ పడుతోంది. రేవంత్ రెడ్డి పనితీరు మారకపోతే... ప్రభుత్వాన్ని ప్రజలే కూల్చివేస్తారు. మేం వాస్తవాలు మాట్లాడితే కేంద్రం ఏమిచ్చిందని ఎదురుదాడి చేయడం సీఎం, మంత్రులకు అలవాటైంది. కేంద్రం ఇచ్చిన నిధుల వివరాలన్నీ ఆధారాలతోసహా ప్రజల ముందుంచాం. మరి మీరు 6 గ్యారంటీల పేరుతో హామీలిచ్చారు. కేంద్రానికి చెప్పి ఆ హామీలను మేనిఫెస్టోలో పెట్టారా? హామీలు ఇచ్చింది మీరు... అమలు చేయాల్సింది మీరే... ఇండ్ల కూల్చివేతపై బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తాం. కాంగ్రెస్, మజ్లిస్ పార్టీలు రెండూ ఒక్కటే. మున్సిపల్ ఎన్నికల్లోనూ కలిసే పోటీ చేశాయి. కలిసే పదవులు పంచుకున్నాయి. ఇప్పుడు ఒకరికి ఒకరు పడనట్లు డ్రామాలాడుతున్నారు. మరి వాళ్లిద్దరికి ఎక్కడ చెడిందో వాళ్లే చెప్పాలి.కాళేశ్వరంలో అవినీతి జరిగిందని రేవంత్ రెడ్డితోపాటు మంత్రులు గత ఎన్నికల్లో మాట్లాడారు. మేం కూడా అదే చెప్పాం. ఈ అంశంపై విచారణ జరిపే దమ్ము రాష్ట్ర ప్రభుత్వానికి లేదని రేవంత్ రెడ్డి ఒప్పుకుంటే మేం విచారణ చేపట్టేందుకు సిద్ధం. ఆ మేరకు లేఖ రాయాలని సీఎంను కోరుతున్నా.

---

# ప్రజలకు లబ్ది చేకూరేలా కేంద్ర ప్రాయోజిత పథకాలను పకడ్బందీగా జిల్లాలో అమలు చేయాలి

**పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురాం రెడ్డి**

**కేంద్ర ప్రభుత్వ పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేయాలి**

**10 వేల ఇందిరమ్మ ఇళ్లకు స్లాబింగ్ పూర్తి**

**ఖమ్మం జిల్లా అభివృద్ధి, సమన్వయ పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించి కేంద్ర ప్రభుత్వ పథకాలపై సమీక్షించిన ఎంపి, జిల్లా కలెక్టర్**




**ఖమ్మం, ప్రతినిధి ఫిబ్రవరి 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజలకు లబ్ది చేకూరేలా కేంద్ర ప్రాయోజిత పథకాలను జిల్లాలో పూర్తి స్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలనీ ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురాం రెడ్డి అన్నారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో పార్లమెంట్ సభ్యులు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యేలు డాక్టర్ మట్టా రాగమయి, రాందాస్ నాయక్, నగర మేయర్ పునుకొల్లు నీరజ, ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ లతో కలిసి పాల్గొన్నారు.దిశ సమావేశంలో ప్రస్తుతం వారి శాఖల పరిధిలో అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలపై జిల్లా సంక్షేమ అధికారి, జీఎం పరిశ్రమలు, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి, మున్సిపల్ కమీషనర్ లు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, పీ.డీ జాతీయ రహదారులు, పి.డి. హౌసింగ్, విద్యుత్ శాఖ, మిషన్ భగీరథ అధికారులు నివేదికలు వివరించారు. పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురాం రెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం స్థానంలో నూతనంగా వచ్చిన వికసిత్ భారత్ జి రామ్ జి పథకం మార్గదర్శకాలు ప్రతి ప్రజా ప్రతినిధికి అందేలా చూడాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో అందించే మధ్యాహ్న భోజన పథకం నాణ్యతను రెగ్యులర్ గా మానిటర్ చేయాలని అన్నారు. జిల్లాలో కేంద్ర ప్రభుత్వం ద్వారా నడిచే వివిధ వైద్య సేవలలో ఉన్న ఖాళీలను తాత్కాలిక ప్రాతిపదికన భర్తీకి చర్యలు తీసుకోవాలని, ఖమ్మం ఆసుపత్రి మరమ్మత్తు, క్రిటికల్ కేర్ బ్లాక్, ఇతర మౌళిక వసతుల పనుల పురోగతి వివరాలు అందించాలని అన్నారు. జిల్లాలో ప్రైవేట్ ఆసుపత్రిలో అధికంగా సి సెక్షన్ ఆపరేషన్స్ జరుగుతున్నాయని, దీని పై కలెక్టర్ రివ్యూ నిర్వహించాలని అన్నారు. జిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధి పనులపై రిపోర్ట్ అందించాలని, సంబంధిత మంత్రితో సమావేశమయి నూతనంగా నిర్మించిన ఎన్ హెచ్ త్వరగా ఓపెన్ అయ్యేలా చూస్తామని అన్నారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ గత సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు జిల్లాలోని ఐటిఐ, డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలలోని విద్యార్థులకు పెద్ద ఎత్తున ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకాలపై విస్తృతంగా అవగాహన కల్పించామని అన్నారు. జిల్లా లో ఉన్న సెంట్రల్ టూల్ డిజైన్ సెంటర్ కు కేంద్రం నుంచి నిధులు సాధించేలా ప్రతిపాదనలు తయారు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. రాబోయే రబీ సీజన్ లో ధాన్యం కొనుగోలు రవాణా కోసం వినియోగించే వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందించే మధ్యాహ్నం భోజన నాణ్యతను జిల్లా అధికారులు పర్యవేక్షించేలా చర్యలు తీసుకున్నామని, 45 లక్షల రూపాయలతో ప్రతి ప్రభుత్వ పాఠశాలకు గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తున్నామని



అన్నారు. వైరా మున్సిపాలిటీ పరిధిలో 3 వారాల వ్యవధిలో చెరువు పక్కన వేస్తున్న డంప్ తొలగించాలని, రోడ్డు పక్కన చెత్త డంప్ చేయరాదని అన్నారు. జిల్లాలో పోడు పట్టాలలో బోర్లు వేసుకునేందుకు కొన్ని చోట్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని వీటిని పరిశీలించి పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి అవసరమైన వసతుల అంశాలకు సంబంధించి తయారు చేసిన సంక్షిప్త నివేదిక ప్రజాప్రతినిధులకు అందించాలని, వీటిని ప్రభుత్వం ద్వారా మంజూరు అయ్యేలా ప్రజాప్రతినిధులు తమ వంతు ప్రయత్నం చేయాలని కలెక్టర్ కోరారు. జిల్లాలో 9 నుంచి 14 సంవత్సరాల వయస్సు గల బాలికలకు హెచ్.పి.వి. వ్యాక్సినేషన్ చేపట్టేందుకు పటిష్ట కార్యాచరణ చేపట్టామని, దీని వల్ల మహిళల్లో సర్వైవల్ క్యాన్సర్ రాకుండా చేయవచ్చని తెలిపారు. ఆర్.ఓ.బీ పనులు, టోల్ టెండరింగ్ పనులు సమాంతరంగా జరగాలని అన్నారు. మార్చి 20 నాటికి జిల్లాలో అత్యధికంగా ప్రమాదాలు జరిగే 30 జంక్షన్ లలో రోడ్డు ప్రమాదాల నియంత్రణ కు అవసరమైన చర్యలు పూర్తి చేస్తామని తెలిపారు. వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ ఆర్.ఓ.ఎఫ్.ఆర్ పట్టాలు పొందిన రైతులు బోర్లు వేసేందుకు, కరెంట్ పెట్టుకునేందుకు ఇబ్బందులకు గురి కాకుండా చూడాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు కొంత మందికి నిర్మాణం మధ్యలో ఎల్ 1 నుంచి ఎల్ 3 మార్చడం వల్ల ఇబ్బందులకు గురవుతున్నారని, మొదటి దశలో మంజూరు చేసిన ఇండ్లు వర్షాకాలం రాకముందే పూర్తయ్యే విధంగా కృషి చేయాలని కోరారు.సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి మాట్లాడుతూ సత్తుపల్లి ఆసుపత్రి సెక్యూరిటీ గార్డ్స్ డిప్యూటేషన్ పై మరో చోట పని చేయడం వల్ల చాలా ఇబ్బందులు వస్తున్నాయని తెలిపారు. సత్తుపల్లి ఆసుపత్రికి కేటాయించిన అంబులెన్స్ డ్రైవర్ పోస్ట్ శాంక్షన్ చేయాలని అన్నారు. అంగన్వాడి కేంద్రాలకు సొంత భవనాలను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కోరారు. మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజీ సమస్యల కారణంగా త్రాగునీటి ఇబ్బంది గ్రామాలలో ఉందని, వీటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అన్నారు.ఈ సమావేశంలో జెడ్పీ సి.ఈ.ఓ. దీక్షా రైనా, మున్సిపల్ చైర్ పర్సన్లు, సర్పంచులు, జిల్లా అధికారులు, దిశ కమిటీ సభ్యులు, మునిసిపల్ కమీషనర్లు, ప్రజా ప్రతినిధులు,పాల్గొన్నారు.

# అమరజీవి యర్రా శ్రీకాంత్ విగ్రహావిష్కరణకు భారీ ఏర్పాట్లు

**• ఖమ్మంలో 28న సిపిఎం ఆధ్వర్యంలో బహిరంగ సభ**




**ఖమ్మం, ప్రతినిధి ఫిబ్రవరి 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజా ఉద్యమాలకు అంకితభావంతో పనిచేసిన అమరజీవి, సిపిఎం జిల్లా నాయకులు కామ్రేడ్ యర్రా శ్రీకాంత్ గారి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఈ నెల 28న ఖమ్మం నగరంలో ఘనంగా నిర్వహించనున్నారు. సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఉదయం 10.30 గంటలకు ఖమ్మం త్రీటౌన్ ప్రాంతంలోని సుభాష్ చంద్రబోస్ సెంటర్ వద్ద ఈ కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమానికి సిపిఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై. విక్రమ్ సభాధ్యక్షత వహించనున్నారు. ముఖ్య అతిథులుగా సిపిఎం పోలిట్ బ్యూరో సభ్యులు బి.వి. రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు మాచర్ల భారతి, కళ్యాణం వెంకటేశ్వరరావు, బండి రమేష్, బుగ్గవీటి సరళ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొంతు రాంబాబు, యర్రా శ్రీనివాసరావు, ఖమ్మం త్రీటౌన్ కార్యదర్శి భూక్య శ్రీనివాసరావు తదితరులు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా అమరజీవి యర్రా శ్రీకాంత్ సేవలను స్మరించుకుంటూ ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించడంతో పాటు బహిరంగ సభను నిర్వహించనున్నారు. ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం చేసిన ఆయన స్ఫూర్తిని కొనసాగించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పార్టీ నాయకులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణులు, ప్రజా సంఘాల నాయకులు, అభిమానులు భారీ సంఖ్యలో హాజరుకావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

# వెలుగుమట్ల భూబాధితులకు భరోసా... నేడు ఈటెల రాజేందర్ పర్యటన

**ఖమ్మం, ప్రతినిధి ఫిబ్రవరి 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఖమ్మం నగర శివారులోని వెలుగుమట్ల భూబాధితులకు భరోసా కల్పించేందుకు ఈటెల రాజేందర్ నేడు ఖమ్మం జిల్లాకు రానున్నారు. భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా, ఈటెల రాజేందర్ మల్కాజిగిరి లోకసభ సభ్యుడిగా ఉన్న ఆయన శనివారం ఉదయం 11 గంటలకు వెలుగుమట్లలో బాధితులను పరామర్శించనున్నారు. ఈ విషయాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. పర్యటనలో భాగంగా ఈటెల రాజేందర్ భూబాధితులతో ముఖాముఖి సమావేశం కానున్నారు. క్షేత్రస్థాయిలో వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను నేరుగా అడిగి తెలుసుకుని, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలపై చర్చించనున్నారు. పార్టీ పక్షాన బాధితులకు అండగా నిలుస్తామని, వారికి చట్టబద్ధంగా పూర్తి న్యాయం జరిగేలా అన్ని వేదికలపై పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేయనున్నట్లు తెలిసింది. బాధితులకు కొండంత ధైర్యం నింపుతూ, అడుగడుగునా రక్షణ కవచంలా నిలబడతామని ఈటెల రాజేందర్ ప్రకటించనున్నారని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, బాధితుల పక్షాన అందరూ ఏకమై నిలవాలని జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు పిలుపునిచ్చారు.

# భూదాన్ భూముల తొలగింపులపై వేగంగా సర్వే.. అర్హులైన పేదలకు ఇళ్ల కేటాయింపుపై ప్రభుత్వం చర్యలు

**ఖమ్మం, ప్రతినిధి ఫిబ్రవరి 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** వెలుగుమట్ల గ్రామంలోని భూదాన్ భూముల ఆక్రమణలో భాగంగా ఈ నెల 24న తొలగించబడిన ఇండ్లకు సంబంధించిన వ్యక్తులపై సామాజిక, ఆర్థిక సర్వేను అత్యవసరంగా చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. అర్హులైన పేదవారికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ఈ మేరకు జిల్లాలోని 14 మంది తహశీల్దార్లకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. సర్వే ప్రక్రియను అత్యంత వేగంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించినట్టు పేర్కొన్నారు. తొలగించబడిన ప్రతి కుటుంబం యొక్క సామాజిక, ఆర్థిక పరిస్థితులను సమగ్రంగా నమోదు చేసి, నివేదికను త్వరితగతిన సమర్పించాలన్నారు. సర్వే పూర్తైన అనంతరం అర్హత కలిగిన కుటుంబాలకు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నివాస స్థల పట్టాలు మంజూరు చేయడం, అలాగే ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపునకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వివరించారు. పేదల పునరావాసంపై ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన భరోసా ఇచ్చారు. తొలగింపుకు గురైన కుటుంబాలు తమ తమ గ్రామాల్లో అందుబాటులో ఉండి సర్వే బృందాలకు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. అధికారుల సూచనలు పాటిస్తూ అవసరమైన పత్రాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు

# తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ప్యానెల్ న్యాయవాదిగా పాక నవీన్ బాబు ఎంపిక



**హైదరాబాద్ ఫిబ్రవరి 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రముఖ న్యాయవాది పాక నవీన్ బాబు తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ప్యానెల్ న్యాయవాదిగా ఎంపికయ్యారు. న్యాయవాద వృత్తిలో ఆయన అందించిన విశిష్ట సేవలను, పేద ప్రజల పట్ల ఆయన చూపుతున్న నిబద్ధతను గుర్తించిన హైకోర్టు అధికారులు ఆయనకు ఈ అవకాశాన్ని కల్పించారు. నవీన్ బాబు న్యాయవాద వృత్తి జీవితంలో ఎప్పుడూ ఆర్థికంగా వెనుకబడిన, చట్టసహాయం అందుకోలేని పేద ప్రజల కోసం పోరాడారు. నిస్వార్థంగా పేదలకు న్యాయసేవలందించడమే తన లక్ష్యంగా పెట్టుకున్న ఆయన, ఎంతో మంది అణచివేయబడిన వర్గాల ప్రజలకు న్యాయం చేయించడానికి కృషి చేశారు. తన వృత్తి ధర్మాన్ని అక్షరాలా పాటిస్తూ, సామాన్య ప్రజల కష్టాలను న్యాయస్థానాల దృష్టికి తీసుకురావడంలో ఆయన విశేష కృషి చేశారు. తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ప్యానెల్ న్యాయవాదిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పాక నవీన్ బాబు మాట్లాడుతూ పేదలకు న్యాయం అందడం లేదనే ఆవేదనతోనే నేను న్యాయవాద వృత్తిని ఎంచుకున్నాను. ఈ కొత్త బాధ్యతలో కూడా సమాజ శ్రేయస్సు కోసం, ప్రజా ప్రయోజనాల కోసం నా సేవలను అందిస్తాను. అన్యాయానికి గురయ్యే ప్రతి పేద వ్యక్తికి న్యాయాన్ని అందించడానికి నా స్థాయిలో పూనుకుంటాను అని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని వివిధ కేసులలో ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించే అవకాశం లభించినందుకు ఆయన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులకు, న్యాయవాద సహచరులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన ఎంపికపై న్యాయవాదులు, సామాజిక కార్యకర్తలు మరియు స్థానిక నాయకులు సంతోషం వ్యక్తం చేశారు.

# పేదల ఇండ్ల తొలగింపు అమానవీయ చర్య







**- న్యాయం జరిగే వరకు పోరాటం**

**- బాధితులను పరామర్శించిన కూనంనేని**

**ఖమ్మం ప్రతినిధి, ఫిబ్రవరి 27 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మంలో పేదల ఇండ్ల తొలగింపు అమానవీయ చర్య అని కనీసం నోటీసులు ఇవ్వకుండా ఎలా తొలగిస్తారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ప్రశ్నించారు. కొందరు అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, వితండవాదం చేస్తున్నారని పేదల పట్ల ఇలా వ్యవహరించడం సరైంది కాదన్నారు. శుక్రవారం వెలుగుమట్ల నిర్వాసితులు ఆశ్రయం పొందుతున్న టిటిడిసి, అంబేద్కర్ భవన్లో ని బాధితులను పరామర్శించారు. జరిగిన ఘటన గురించి తెలుసుకున్నారు. పేదలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఏ ప్రాంతం నుంచి వచ్చారు, ఎంత కాలంగా నివాసం ఉంటున్నారు, కుటుంబ పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్న కూనంనేని బాధితులకు కనీస అవకాశం ఇవ్వకుండా ఇలా వ్యవహరించడం అత్యంత బాధాకరమన్నారు. బతుకుదెరువు కోసం సుదూర ప్రాంతాల నుంచి ఖమ్మం వచ్చి తలదాచుకునేందుకు భూదాన్ భూముల్లో గుడిసెలు వేసుకోవడం నేరమా అని ఆయన ప్రశ్నించారు. మీరు పాకిస్తానీలు, బంగ్లాదేశ్ వారు కాదు కదా చుట్టు పక్కల వారే కదా అని ఆయన తెలిపారు. వెలుగుమట్లలోనే ఇల్లు ఇల్లు తిరిగి సర్వే చేసి ఒకవేళ అనర్హులు ఉంటే చర్యలు తీసుకుంటే బాగుండేదని అలా కాకుండా భయోత్పాత వాతావరణాన్ని సృష్టించి పిల్లలు, వృద్ధులు, మహిళలు “అనేది చూడకుండా వీధినపడేయటం ఏరకమైన ప్రజాస్వామ్యమని కూనంనేని ప్రశ్నించారు. ఒకసారి కాకపోతే పలుసార్లు సంప్రదింపులు జరపాలని పేదలను సంతృప్తిపరిచి చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వంపై ఉందన్నారు. సమస్యకు పరిష్కారం చూపకుండా బాధితులపై నేరం మోపడం అధికారం ఉంది. కదా అని ఇష్టానుసారంగా వ్యవహరించడం సరికాదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా భూదాన్ భూముల్లో ఉన్న పేదలకు పట్టాలు అందజేస్తామని స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి శాసనసభలో ప్రకటించారని కూనంనేని గుర్తు చేశారు. పేద ప్రజలకు కమ్యూనిస్టు పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని న్యాయం జరిగే వరకు పేదల పక్షాన పోరాడతామన్నారు. జిల్లాకు చెందిన మంత్రులు ఈ విషయంలో చొరవ చూపి బాధితులకు న్యాయం చేసే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. అధికారులకు సరైన ఆదేశాలు ఇచ్చి అవి అమలు జరిగేవిధంగా చూడాలన్నారు. కొందరు కమ్యూనిస్టుల గురించి తెలియక స్వార్థం కోసం విమర్శలు చేస్తున్నారని కూనంనేని తెలిపారు. ఖమ్మం జిల్లాలో సుదీర్ఘ పోరాట చరిత్ర కమ్యూనిస్టులదని వేల మందికి పోరాట ఫలితంగా నివాస స్థలాలు దక్కాయని ఆయన –తెలిపారు. నాగార్జున సాగర్ కాలువ కట్టలపై గుడిసెలు వేసిన తర్వాత వారికి ప్రత్యామ్నాయ స్థలం చూపి సంతృప్తి చెందిన తర్వాతే గుడిసెలు తొలగించడం జరిగిందని తెలిపారు. కమ్యూనిస్టు నాయకుడు ఉదయ్కుమార్ నగర్ పేరుతో వందలాది మందికి పట్టాలు ఇవ్వడం జరిగిందని సాంబశివరావు గుర్తు చేశారు. ప్రజల పక్షాన పోరాడటం, పేదలకు అండగా నిలవడం మా బాధ్యత అని దానిని ఎవరు గుర్తు చేయాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. ఉన్నతాధికారులతో మాట్లాడి పునరావాస కేంద్రంలో కనీస వసతులు కల్పించాలని ఎక్కడ నుంచి తొలగించారో అక్కడే పేదలకు స్థలాలు కేటాయించాలన్నారు. ఉన్నతాధికారులు ఏ లక్ష్యం కోసం ఆ భూమి నుంచి పేదలను ఖాళీ చేయించారో వివరించాల్సిన అవసరం కూడా అధికారులపై ఉందన్నారు. సిపిఐ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రబాబు. ఏపూరి లతాదేవి, సిద్దినేని కర్ణకుమార్, బిజి క్లెమెంట్ తదితరులు పాల్గొన్నారు.

# బంజారాల అభ్యున్నతికి బిజెపి పాటుపడుతుంది: సనాతన ధర్మ రక్షకుడు సేవాలాల్ మహారాజ్

**• మతమార్పిడి ప్రయత్నాలను తిప్పి కొట్టాలి. • లవ్ జిహాదీ చర్యలను హిందూ యువత అడ్డుకోవాలి. • సేవాలాల్ జయంతి వేడుకల్లో బండి సంజయ్ కుమార్.**








**కరీంనగర్,ఫిబ్రవరి27(పీసీడబ్ల్యూ న్యూస్):** సనాతన ధర్మ రక్షకుడిగా హిందు సమాజానికి ఆరాధ్య దైవంగా.. శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ అన్ని తరాలకు ఆదర్శనీయుడని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం కరీంనగర్లో నిర్వహించిన సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాల్లో పాల్గొని హాజరైన వారిని ఉద్దేశించి ప్రసంగించారు. బిజెపి సిద్ధాంతాలు సేవాలాల్ మహారాజ్ ఆలోచనలు ఒకే విధంగా ఉండేవని ఆయన సనాతన ధర్మాన్ని రక్షించిన తీరు ఆదర్శనీయమని సంజయ్ అన్నారు. తను పాదయాత్ర సమయంలో గిరిజన తండాల్లో ఎక్కువగా పర్యటించానని వారి కష్ట సుఖాలు తనకు తెలుసన్నారు. కేంద్రంలో మోడీ సర్కారు బంజారాల అభ్యున్నతికి పాటుపడుతుందని చెప్పారు. మహారాష్ట్రలో సేవాలాల్ మహారాజ్ దేవాలయాన్ని నిర్మించిన విషయాన్ని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలోనూ ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడంతో పాటు బడ్జెట్ అందించిన ఘనత తమ ప్రభుత్వానిదని కొనియాడారు. ఎస్సీ కమిషన్ ఏర్పాటు చేసి కేంద్ర ప్రభుత్వ పథకాలను కూడా గిరిజనులకు అందిస్తున్నామన్నారు. గత బిఆర్ఎస్ హయంలో తండాలను పంచాయతీలుగా మాత్రమే చేసి వదిలి పెట్టారని మౌలిక వసతులను విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో గిరిజన తండాల్లో బోర్లు వేయిస్తూ తాగునీటి సమస్యను మౌలిక వసతుల్ని కల్పించాననే విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం బంజారా సమాజం జాగృతం కావలసిన సమయం ఆసన్నమైందని బండి సంజయ్ కోరారు. కొందరు మతమార్పిడి కి ప్రయత్నాలు చేస్తున్నారని వారి ప్రయత్నాన్ని ఎక్కడికక్కడ తిప్పి కొట్టాలని సూచించారు. ఏ మతంలో పుట్టాలనేది దైవ నిర్ణయం అని ఆ దైవ నిర్ణయాన్ని ధిక్కరించిన వారి కి దేవుడు తగిన శిక్ష వేస్తాడన్నారు. మతం మారే వాళ్లను దేవుడు సహించడన్నారు. లవ్ జిహాది కేసులు ఇటీవల చాలా పెరుగుతున్నాయని ఇదంతా ఒక వర్గం వాళ్ళు ప్రణాళిక ప్రకారం చేస్తున్న కుట్ర అని ఆరోపించారు. హిందూ సమాజంలోని అమ్మాయిలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. హిందూ యువత జాగ్రతమవ్వాలని. ఎక్కడికక్కడ లవ్ జిహాదీ చర్యాలను తిప్పి కొట్టాలన్నారు. కేంద్ర హోం శాఖ మంత్రిగా తాను ఈ మాట చెప్పకూడదనితనకు పదవి కన్నా హిందూ ధర్మ పరిరక్షణ గొప్పది అన్నారు. హిందువులు కేవలం చదువుకోవడంతోనే సరిపోదని చదువు సంస్కారంతో పాటు సమాజాన్ని కాపాడుకోవాలనే లక్ష్యం ఉండాలన్నారు. బీటెక్, ఎంటెక్ ఉన్నత విద్య చదివిన హిందూ అమ్మాయిలను ఆవారాగా రోడ్లపై తిరిగే వాళ్ళు లవ్ పేరిట వేధిస్తూ మతం మారుస్తున్న చర్యలను తిప్పికొట్టాలని హిందూ సమాజానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ మహేశ్వర్ తో పాటు గుగులోతు తిరుపతి నాయక్, భూక్య తిరుపతి నాయక్, రాజు నాయక్, రాందాస్ నాయక్, భీమా సాహెబ్, లావుడియా కిషన్ నాయక్, రాజు నాయక్, శ్రావణ్ నాయక్, ధరావత్, తిరుపతి నాయక్, శ్రీకాంత్ నాయక్, లక్పతి నాయక్, సదానందం నాయక్, రాజన్న నాయక్, రైనా నాయక్, సంతోష్ నాయక్, దస్మి బాయ్, భాస్కర్ నాయక్, బిచ్చ నాయక్, రమేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి వద్దకే సీతారామస్వామి వారి కళ్యాణ తలంబ్రాలు

**- ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ఎ. సరిరామ్**



**ఖమ్మం ప్రతినిధి, ఫిబ్రవరి 27 (పిసిడబ్ల్యూ న్యూస్) :** శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో జరగబోయే శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవ తలంబ్రాలను భక్తులకు ఇంట్టి వద్దనే అందజేయాలని ఆర్టీసీ లాజిస్టిక్ విభాగం నిర్ణయించింది. మార్చి 27న భద్రాచలంలో అత్యంత వైభవంగా జరగబోయే శ్రీరామనవమి వేడుకలను దృష్టిలో ఉంచుకొని వివిధ కారణాల వల్ల భద్రాచలంకు వెళ్లలేని భక్తుల కొరకు దేవదాయశాఖ సహకారంతో ఇంటి వద్దకు కళ్యాణ తలంబ్రాలను చేరవేయబడునని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ఎ. సరిరామ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంతో విశిష్టత కలిగిన ఈ తలంబ్రాల ప్యాకెట్లు పొందాలనుకునే భక్తులు ఆన్లైన్లో www.tgsrtclogistics.gov.in నందు ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని కార్గో సెంటర్లయందు 151 రూపాయలు చెల్లించి బుక్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ విధంగా బుక్ చేసుకున్న తలంబ్రాలను కళ్యాణోత్సవం అనంతరం భక్తుల ఇంటి వద్దకే చేరవేయబడునని తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్ను ఖమ్మం కార్యాలయం నందు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి డిప్యూటీ ఆర్.ఎం. యు. రాజ్యలక్ష్మి, ఖమ్మం డిపో మేనేజర్ మేడ శివప్రసాద్, ఎకౌంట్స్ ఆఫీసర్ జ్యోత్స్న, పర్సనల్ ఆఫీసర్ శ్యామలాదేవి, కార్గో సిబ్బంది పాల్గొన్నారు. బుకింగ్ వివరాలకు ఖమ్మం : 9154298583,మధిర, సత్తుపల్లి 9154298585,కొత్తగూడెం, ఇల్లందు : 9154298582భద్రాచలం మణుగూరు: 9154298586సంప్రదించగలరని తెలిపారు.

# శాంతియుతంగా నిరసన తెలిపితే అరెస్టు చేయడం సరికాదు..







**చిట్యాల ఫిబ్రవరి 27(పీసిడబ్ల్యూ న్యూస్):** భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి ఆదేశాల మేరకు చిట్యాల మండలం కేంద్రం లో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు అల్లకొండ కుమార్ ఆధ్వర్యంలో యువజన కాంగ్రెస్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఓరుగంటి మహిపాల్ రెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బండ శ్రీకాంత్ హాజరు కావడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ, యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్ గారిని ఢిల్లీ పోలీసులు అరెస్టు చేయడం బాధాకరం. ఢిల్లీలో జరిగిన ఏఐ సమ్మిట్‌లో నిరసన తెలిపినందుకు అరెస్టు చేశారు. ఉదయ్ భాను చిబ్ తో పాటు మరో 7 మందిని అరెస్టు చేసి పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేయడం దుర్మార్గమని తెలిపారు యువజన కాంగ్రెస్ పక్షాన ఈ అరెస్టును తీవ్రంగా ఖండింస్తున్నామని అని తెలిపారు.శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి ఉందని, ఈ అరెస్టు రాజ్యాంగ విరుద్ధమని మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. ఉదయ్ భాను చిబ్‌ను వెంటనే విడుదల చేయాలని యూత్ కాంగ్రెస్ తరుపున డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చుంచుల మహేష్.అసెంబ్లీ అధ్యక్షులు నమునూరి రజినీకాంత్. మండల అధ్యక్షులు అల్లకొండ కుమార్. చిట్యాల మండల యూత్ నాయకులు దూడపాక సురేష్.వెలగొండ చిరంజీవి. తిరుమలాపూర్ యూత్ అధ్యక్షులు కంచర్ల రాంబాబు.జూకల్ యూత్ అధ్యక్షులు కంచు శ్రీకాంత్. చల్లగరీగ యూత్ అధ్యక్షుడు కట్ల మహేష్.నవాబుపేట యూత్ అధ్యక్షులు తీగల నాగరాజు. చిట్యాల టౌన్ యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్ మూష్కే నాగరాజు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవోపేతంగా శ్రీ కళ్యాణ వెంకటరమణ స్వామి వారి బ్రహ్మోత్సవాలు..

- హనుమంత వాహనంపై కోదండ రాముడి చిద్విలాసం



**ఏపీ: అన్నమయ్య జిల్లా: పుంగనూరు: ఫిబ్రవరి 27 (పి సి డబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** పుంగనూరు టీటీడీ పరిధిలోని శ్రీ కళ్యాణ వెంకటరమణ స్వామి వారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవములులో భాగంగా నాల్గవ రోజు సాయంత్రం స్వామి వారు కోదండ రాముడి అలంకారంలో హనుమంత వాహనంలో పుర వీధులలో తిరుగుతూ భక్తులను కటాక్షించారు. వాహనం ముందు మంగళ వాయిద్యాలు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ వారి భజన కోలాట బృందాలు భజన, డప్పు వాయిద్యాలు, శ్రావణానందకరంగా సాగుతున్నాయి. పట్టణ పుర వాసులు అడుగడుగున స్వామి వారికి కర్పూర హారతులు సమర్పించారు. గోవింద నామాల పుస్తక ప్రతులను భక్తులకు ఉచితంగా అందజేశారు. ఆలయ ఇన్స్పెక్టర్ కృష్ణమూర్తి, ప్రధాన అర్చకులు, ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

# భారత్‌పై ఆస్ట్రేలియా విజయం

ఆస్ట్రేలియా మహిళల జట్టు భారత్‌పై వరుసగా రెండో విజయం సాధించింది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా భారత్‌తో ఓవల్ వేదికగా జరిగిన రెండో వన్డేలో ఆసీస్ 5 వికెట్ల తేడాతో నెగ్గింది. భారత్ నిర్దేశించిన 252 పరుగుల టార్గెట్‌ను ఆస్ట్రేలియా 36.1 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. జార్జియా వోల్ (101 పరుగులు) సెంచరీతో అదరగొట్టగా, ఫోబి లిచీఫీల్డ్ (80 పరుగులు) రాణించింది. భారత్ బౌలర్లలో కాశ్వీ గౌతమ్, దీప్తి శర్మ చెరో 2, క్రాంతి గౌడ్ 1 వికెట్ దక్కించుకున్నారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 50 ఓవర్లోల 9 వికెట్లకు 251 పరుగులు చేసింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (51 పరుగులు), ఓపెనర్ ప్రతికా రావల్ (52 పరుగులు) హాఫ్ సెంచరీలతో రాణించారు. స్మృతి మంధాన (31 పరుగులు), కాశ్వీ గౌతమ్ (25 పరుగులు) ఫర్వాలేదనిపించారు. ఆసీస్ బౌలర్లలో అష్లీ గార్డ్‌నర్, అనబెల్, అలన కింగ్ తలో 2, నికోల కేరీ, మేగన్ చెరో 1 వికెట్ దక్కించుకున్నారు. తాజా విజయంతో ముడు వన్డేల సిరీస్‌ను ఆసీస్ ఇంకో మ్యాచ్ మిగిలి ఉండగానే 2-0తో దక్కించుకుంది. మంగళవారం జరిగిన తొలి వన్డేలోనూ భారత్ ఓడింది. ఇక ఇరుజట్ల మధ్య నామమాత్రమైన మూడో మ్యాచ్ మార్చి 01న ఓవల్ వేదికగానే జరగనుంది. ఆ తర్వాత మార్చి 06న ఏకైక టెస్టు మ్యాచ్ ప్రారంభం కానుంది.



# అభిషేక్‌పై యువరాజ్ సింగ్ ప్రశంసలు



టీమ్‌ఇండియా యంగ్ బ్యాటర్ అభిషేక్ శర్మ ఎట్టకేలకు ఫామ్‌లోకి వచ్చాడు. ఈ టోర్నమెంట్‌లో వరుసగా నాలుగు ఇన్నింగ్స్‌ల్లో ఘోరంగా విఫలమైన ఈ యువ ఓపెనర్ తాజాగా జింబాబ్వేతో మ్యాచ్‌లో అర్ధ శతకంతో రాణించాడు. 30 బంతుల్లో 55 పరుగులు చేసి, తన ఫామ్‌పై మేనేజ్‌మెంట్‌కు ఉన్న అనుమానాలన్నింటినీ పటాపంచలు చేశాడు. ఈ క్రమంలోనే అతడి ఇన్నింగ్స్‌పై మాజీ క్రికెటర్, తన మెంటార్ యువరాజ్ సింగ్ మోటివేషనల్ మెసేజ్ పంపించాడు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఇన్‌స్టాగ్రామ్‌లో స్టోరీ షేర్ చేశాడు. అభిషేక్ ఇన్నింగ్స్‌పై ప్రశంసలు కురిపిస్తూ మెసేజ్ రాసుకొచ్చాడు. 'అర్థంలేని చర్చలు జరుగుతున్నప్పుడు బ్యాటింగ్ తోనే మాట్లాడావు. అభిషేక్ సార్ ఇది మంచి ప్రదర్శన. ఇలాగే ముందుకు సాగిపో' అని ఇన్‌స్టా స్టోరీ రాసుకొచ్చాడు. అయితే ఈ టోర్నీలో అభిషేక్ వరుసగా ఫెయిల్ అవ్వడంతో అతడిపై తీవ్రంగా విమర్శలు వచ్చాయి. అందుకే అతడికి మద్దతుగా యువీ ఈ మెసేజ్ షేర్ చేశాడని ఫ్యాన్స్ అనుకుంటున్నారు. అలాగే ఈ మ్యాచ్‌లో ఆకట్టుకున్న హార్దిక్ పాండ్య, అర్షదీప్ సింగ్‌పై కూడా యూవీ ప్రశంసలు కురిపించాడు. 'అద్భుతమైన పవర్ హిట్టింగ్. ఇన్నింగ్స్‌ను అద్భుతంగా ముంగించావు' అని హార్దిక్‌ను ప్రశంసించగా, 'స్పీడ్‌స్టర్ అర్షదీప్ ట్రిపుల్ ధమాకా. సరైన సమయంలో వికెట్లు తీసి ప్రత్యర్థులను ఒత్తిడిలోకి నెట్టావు' అని యువీ పోస్టు చేశాడు. ఇటీవల అభిషేక్ విఫలం అవ్వడం వల్ల అతడు తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నాడు. ఈ క్రమంలోనే పాకిస్థాన్ మాజీ క్రికెటర్ మహ్మద్ ఆమిర్ కూడా అభిషేక్‌పై తీవ్ర విమర్శలు గుప్పించాడు. 'అభిషేక్‌కు డిఫెన్సివ్ క్రికెట్ ఆడడం రాదు. స్కిల్స్ లేవు, అతడు ఓ స్లోగర్ మాత్రమే' అని వ్యాఖ్యానించాడు. అయితే ఆమిర్ వ్యాఖ్యలకు తాజాగా టీమ్‌ఇండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ కౌంటర్ ఇచ్చాడు. తన యూట్యూబ్ ఛానెల్‌లో దీనిపై మాట్లాడాడు. 'అభిషేక్‌పై మహ్మద్ ఆమిర్ చేసిన కామెంట్స్ తాలూకు వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

# పాకిస్థాన్ మాజీ పేసర్ మహమ్మద్ అమీర్‌కు అశ్విన్ కౌంటర్



టీమిండియా ఓపెనర్ అభిషేక్ శర్మపై మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ప్రశంసల జల్లు కురిపించాడు. అతనిది అసూయపడే బ్యాట్ స్వింగ్ అని కొనియాడాడు. అభిషేక్ శర్మ గాలిగాడంటూ పాకిస్థాన్ మాజీ పేసర్ మహమ్మద్ అమీర్ చేసిన వ్యాఖ్యలకు అశ్విన్ తనదైన శైలిలో కౌంటరిచ్చాడు.ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో వరుసగా మూడు మ్యాచ్‌ల్లో డకౌట్ అయిన అభిషేక్ శర్మ.. జింబాబ్వేతో మ్యాచ్‌లో హాఫ్ సెంచరీతో ఎట్టకేలకు ఫామ్ అందుకున్నాడు. 30 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో 55 పరుగులు చేశాడు. ఈ మ్యాచ్‌లో భారత్ 72 పరుగులతో గెలిచి సెమీస్ ఆశలను సజీవంగా ఉంచుకుంది.ఈ మ్యాచ్ అనంతరం తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడిన అశ్విన్.. అభిషేక్ శర్మను కొనియాడుతూ... మహమ్మద్ అమీర్‌కు కౌంటరిచ్చాడు. 'అభిషేక్ శర్మను 'స్లాగర్'(బంతిని విచక్షణారహితంగా బాదే వ్యక్తి) అని పిలుస్తూ మహమ్మద్ అమీర్ చేసిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. నేను ఒక విషయం స్పష్టం చేయాలనుకుంటున్నా.. మీరు అభిషేక్ ఆట గురించి ఏదైనా చెప్పండి. కానీ అతను మాత్రం స్లాగర్ కాదు. ప్రస్తుత క్రికెట్‌లో ఎవరైనా అసూయపడేంత గొప్ప బ్యాట్ స్వింగ్ అతని సొంతం. యువరాజ్ సింగ్ అతని మెంటార్ అని మనందరికీ తెలుసు.అభిషేక్ బ్యాట్ స్వింగ్ యువరాజ్ కంటే మెరుగ్గా ఉంటుంది.



# అర్ష్‌దీప్ సింగ్ సరికొత్త చరిత్ర

ఐసీసీ టీ20 వరల్డ్ కప్ 2026లో టీమిండియా జైత్రయాత్ర కొనసాగుతోంది. గురువారం చెన్నై వేదికగా జరిగిన సూపర్-8 పోరులో భారత్ 72 పరుగుల తేడాతో జింబాబ్వేను చిత్తు చేసింది. ఈ విజయంతో భారత్ సెమీఫైనల్ బెర్త్‌కు అడుగు దూరంలో నిలిచింది. ముందుగా బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 256 పరుగులు చేసింది. ఇది టీ20ల్లో భారత్‌కు అత్యధిక స్కోరు కాగా, వరల్డ్ కప్ చరిత్రలో రెండో అతిపెద్ద స్కోరు. బ్యాటర్లు శివాలెత్తిన వేళ, బౌలింగ్‌లో అర్ష్‌దీప్ సింగ్ సరికొత్త రికార్డులతో చరిత్ర సృష్టించాడు. ఈ మ్యాచ్‌లో టీమిండియా యువ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ రికార్డుల వేట సాగించాడు. జింబాబ్వేపై 4 ఓవర్లలో కేవలం 24 పరుగులిచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టాడు. ఈ క్రమంలో టీ20 వరల్డ్ కప్ చరిత్రలో భారత్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. ఇప్పటివరకు 33 వికెట్లతో అగ్రస్థానంలో ఉన్న జస్ప్రీత్ బుమ్రాను అర్ష్‌దీప్ అధిగమించాడు. కేవలం 19 మ్యాచుల్లోనే అర్ష్‌దీప్ 35 వికెట్లు తీసి ఈ ఘనత సాధించడం విశేషం. బుమ్రా 23 మ్యాచుల్లో 33 వికెట్లు తీయగా, అశ్విన్ (32 వికెట్లు), హార్దిక్ పాండ్యా (29 వికెట్లు) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. అంతేకాకుండా టీ20 వరల్డ్ కప్ చరిత్రలో ఒక లెఫ్ట్ ఆర్మ్ పేసర్‌గా అత్యధిక వికెట్లు తీసిన ప్రపంచ రికార్డును కూడా అర్ష్‌దీప్ తన పేరిట రాసుకున్నాడు.

# గంభీర్-సూర్య వేసిన మాస్టర్ ప్లాన్ అదుర్స్



ఐసీసీ టీ20 వరల్డ్ కప్ 2026లో టీమిండియా యువ ఓపెనర్ అభిషేక్ శర్మ ఎట్టకేలకు తన పవర్ ఏంటో చూపించాడు. సూపర్ 8 దశలో జింబాబ్వేతో జరిగిన మ్యాచ్‌లో ఈ లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ సిక్సర్ల సునామీ సృష్టించాడు. ఈ టోర్నమెంట్‌లో ఇప్పటివరకు వరుసగా మూడు సార్లు డకౌట్ (0) అయి తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న అభిషేక్, సరైన సమయంలో ఫామ్‌లోకి వచ్చి అందరి నోళ్లు మూయించాడు. చెన్నైలోని చెపాక్ స్టేడియంలో జరిగిన ఈ పోరులో కేవలం 30 బంతుల్లోనే 55 పరుగులు బాదాడు. ఇందులో 4 ఫోర్లు, 4 కళ్లు చెదిరే సిక్సర్లు ఉన్నాయి. టీ20 వరల్డ్ కప్‌లో అతనికి ఇది మొదటి హాఫ్ సెంచరీ కావడం విశేషం. అభిషేక్ శర్మ ఇలా ఒక్కసారిగా గాడిలో పడటం వెనుక టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ వేసిన ఒక తెలివైన మాస్టర్ ప్లాన్ ఉంది. ఈ మ్యాచ్‌కు ముందు వరకు అభిషేక్ ఫామ్ చాలా దారుణంగా ఉండేది. లెఫ్ట్ హ్యాండర్ కావడంతో ప్రత్యర్థి జట్లు ఆఫ్ స్పిన్నర్లను రంగంలోకి దింపి అతడిని కట్టడి చేసేవి. అయితే ఈసారి గంభీర్-సూర్య ద్వయం ఒక వ్యూహాన్ని మార్చారు. ఇషాన్ కిషన్‌ను పక్కన పెట్టి, సంజూ శామ్సన్‌ను జట్టులోకి తీసుకోవడమే కాకుండా నేరుగా ఓపెనింగ్‌కు పంపారు. దీనివల్ల లెఫ్ట్-రైట్ కాంబినేషన్ కుదిరి జింబాబ్వే కెప్టెన్ లెక్కలు తలకిందులయ్యాయి. సాధారణంగా ఇద్దరు లెఫ్ట్ హ్యాండర్లు ఓపెనింగ్ చేస్తే ప్రత్యర్థులు ఆఫ్ స్పిన్నర్లతో బౌలింగ్ మొదలుపెడతారు. కానీ ఈసారి రైట్ హ్యాండర్ అయిన సంజూ శామ్సన్ క్రీజులోకి రావడంతో జింబాబ్వే ఆ సాహసం చేయలేకపోయింది. సంజూ స్పిన్‌ను అద్భుతంగా ఆడతాడు కాబట్టి, వారు పేసర్లను దించక తప్పలేదు. పేస్ బౌలింగ్‌ను చీల్చి చెండాడటంలో అభిషేక్ సిద్ధహస్తుడు. సరిగ్గా ఇదే జరిగింది. సంజూ శామ్సన్ 15 బంతుల్లోనే 24 పరుగులు చేసి మంచి పునాది వేయగా, అభిషేక్ తన దూకుడుతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. వీరిద్దరి మధ్య కుదిరిన 48 పరుగుల భాగస్వామ్యం ఈ టోర్నీలో భారత్‌కు అత్యుత్తమ ఓపెనింగ్ పార్ట్‌నర్‌షిప్. పవర్ ప్లే ముగిసేసరికి భారత్ ఏకంగా 80 పరుగులు చేసింది. ఈ అదిరిపోయే ఆరంభం వల్లే టీమిండియా 256 పరుగుల భారీ స్కోరును సాధించగలిగింది. అభిషేక్ శర్మ తిరిగి ఫామ్‌లోకి రావడం, సంజూ శామ్సన్ మెరుపులు మెరిపించడం చూస్తుంటే గంభీర్ వ్యూహం నూటికి నూరు శాతం ఫలించిందని అర్థమవుతోంది.

# నిఖిల్ కూడా వారి దారిలోనే!

టాలీవుడ్‌లో ఓటీటీ విప్లవం రోజురోజుకీ మరింత వేగం అందుకుంటోంది. థియేటర్లతో పాటు డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు కూడా స్టార్ హీరోలకు సమాన వేదికలుగా మారుతున్నాయి. ఈ క్రమంలో టాలీవుడ్ యంగ్ హీరో నిఖిల్ సిద్ధార్థ్ కూడా త్వరలో ఓటీటీ ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు ప్రకటించడం ఇండస్ట్రీలో చర్చనీయాంశమైంది. ఇప్పటికే పీరియడ్ యాక్షన్ డ్రామా స్వయంభుతో పాటు పలు భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్న నిఖిల్, ఇప్పుడు డిజిటల్ వరల్డ్‌లో కూడా తన ముద్ర వేయాలని చూస్తున్నార

నిఖిల్ మాత్రమే కాదు, గత కొన్ని సంవత్సరాల్లో టాలీవుడ్‌కు చెందిన పలువురు ప్రముఖ హీరోలు ఓటీటీ ప్లాట్‌ఫారమ్‌లలో అడుగుపెట్టారు. రానా నాయుడు వెబ్‌సిరీస్ తో ఇప్పటికే వెంకటేష్, రానా ఓటీటీ లోకి ఎంట్రీ ఇచ్చి, ఆడియన్స్ ను అలరించారు. ఇక నాగ చైతన్య దూత అనే వెబ్‌సిరీస్ ద్వారా ఓటీటీలో అడుగుపెట్టి తనలోని ఇంటెన్స్ యాక్టర్‌ను చూపించారు. ఈ సిరీస్‌కు విమర్శకుల ప్రశంసలు లభించాయి. ప్రయోగాలు చేయడానికి రెడీ సత్యదేవ్ కూడా పలు డిజిటల్ ప్రాజెక్టులతో ఓటీటీలో తన రేంజ్‌ను విస్తరించారు. థియేటర్లలో మాత్రమే కాకుండా, ఓటీటీ వేదికల ద్వారా కథల ఎంపికలో ప్రయోగాలు చేయడానికి హీరోలు ఆసక్తి చూపుతున్నారు. ఓటీటీ ప్లాట్‌ఫార్మ్ కు పెరుగుతున్న ప్రాధాన్యం, పాన్ ఇండియా రీచ్, భాషా అవరోధాల తొలగింపు వంటి అంశాలు స్టార్ హీరోలను ఈ వైపు ఆకర్షిస్తున్నాయి. థియేట్రికల్ మార్కెట్‌కు పరిమితమైన కలెక్షన్లకు బదులుగా, డిజిటల్ ద్వారా గ్లోబల్ ఆడియెన్స్‌ను చేరుకునే అవకాశముండటం ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు ఇప్పుడు నిఖిల్ కూడా అదే దారిలో అడుగులు వేస్తుండటం విశేషం. ఇప్పటికే కార్తికేయ 3, ది ఇండియా హౌస్ వంటి ప్రాజెక్టులతో బిజీగా ఉన్న ఆయన, ఓటీటీ ద్వారా మరింత విభిన్నమైన కథాంశాలను అన్వేషించేందుకు సిద్ధమవుతున్నారు.



# ఉదయపూర్ ఎయిర్‌పోర్టులో కొత్త జంట సందడి



టాలీవుడ్ స్టార్ కపుల్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. 26న రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో అత్యంత వైభవంగా వీరి వివాహం జరిగింది. అయితే పెళ్లయిన మరుసటి రోజు ఈ నూతన వధూవరులు ఉదయ్‌పూర్ ఎయిర్‌పోర్ట్‌లో ప్రత్యక్షమవడంతో అక్కడ ఒక్కసారిగా సందడి నెలకొంది. కొత్త పెళ్లికూతురు రష్మిక ఎరుపు రంగు సంప్రదాయ దుస్తుల్లో మెరిసిపోగా, విజయ్ స్టైలిష్ ఇండో-వెస్ట్రన్ అవుట్‌ఫిట్‌లో రాజసం ఉట్టిపడేలా కనిపించారు. తమ అభిమాన జంటను చూడటానికి ఎయిర్‌పోర్ట్‌కు భారీగా చేరుకున్న అభిమానులకు విజయ్, రష్మిక చిరునవ్వుతో అభివాదం చేస్తూ, ఫ్లయింగ్ కిసెస్ ఇస్తూ ఉత్సాహపరిచారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. వీరు నేరుగా ఢిల్లీ వెళ్లి ప్రధాని మోడీని, కేంద్రమంత్రి అమిత్ షాను కలిశారు.

------



# దీపిక అవకాశాలు చేజార్జుకుంటోందా?

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె ఇటీవల వరుస వార్తలతో ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారుతున్నారు. ఆమె కండీషన్స్ కారణంగా ఇప్పటికే ఒప్పుకున్న ప్రాజెక్టులు చేజారిపోతున్నాయనే ప్రచారం గత కొద్ది రోజులుగా నడుస్తోంది. ముఖ్యంగా టాలీవుడ్‌లో భారీ స్థాయిలో తెరకెక్కుతున్న స్పిరిట్, కల్కి 2 చిత్రాల నుంచి ఆమె బయటకు వచ్చినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా మరో హాలీవుడ్ అవకాశం కూడా చేజారిందనే టాక్ వినిపిస్తోంది. హాలీవుడ్‌లో పాపులర్ సిరీస్‌గా రూపొందిన ది వైట్ లోటస్ నాలుగవ సీజన్ కోసం దీపికా పదుకొనే పేరును మేకర్స్ పరిశీలించినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. గ్లోబల్ రీచ్ ఉన్న ఈ సిరీస్‌లో నటించే అవకాశం దక్కింది అంటే అంతర్జాతీయంగా మంచి గుర్తింపు దక్కే అవకాశం ఉంటుంది. అయితే ఈ ప్రాజెక్ట్ కోసం మేకర్స్ ఆమెను ఆడిషన్‌కు రావాలని కోరినట్లు సమాచారం. కానీ, తాను ఆడిషన్‌కు హాజరు కాలేనని దీపికా స్పష్టం చేసినట్లు టాక్ వినిపిస్తోంది. దీంతో ఆమె స్థానంలో మరో నటిని ఎంపిక చేసుకునే దిశగా 'ది వైట్ లోటస్' టీమ్ ముందుకు సాగిందని తెలుస్తోంది. ప్రముఖ అంతర్జాతీయ సిరీస్‌లో నటించే అవకాశం కోల్పోయిందనే వార్తలతో దీపికా అభిమానులు నిరాశకు గురవుతున్నారు. ఇప్పటికే కొన్ని పెద్ద ప్రాజెక్టుల నుంచి బయటకు వచ్చిన నేపథ్యంలో, హాలీవుడ్ కమ్‌బ్యాక్‌కు ఇది మంచి అవకాశంలా భావించకుండా ఇలా ఎందుకు బయటకు వచ్చిందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

------------------

# కామెడీలో కథాత్మక జోడింపు

## విష్ణు విన్యాసం మూవీ





శ్రీవిష్ణుని మ్యాన్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ అనే పేరుంది. దానికి తగ్గట్టే 'విష్ణు విన్యాసం' సినిమాను మొదట్నుంచీ పూర్తి వినోదాత్మక చిత్రంగా ప్రచారం చేశారు. శ్రీవిష్ణు కామెడీ మూవీ అనగానే ఆడియన్స్‌లో అంచనాలు కామన్. దాంతో నిర్మాణంలో ఉండగానే సినిమాపై హైప్ మొదలైంది. దానికి తగ్గట్టు ప్రచార చిత్రాలు కూడా సినిమాపై అంచనాలు పెంచాయి. 'విష్ణు విన్యాసం' అనే టైటిల్ పెట్టి తొలి అడుగులోనే ఆడియన్స్‌లో మార్కులు కొట్టేశాడు దర్శకుడు యదునాథ్ మారుతీరావు. విష్ణు(శ్రీవిష్ణు) ఓ కాలేజ్‌లో ట్రైనీ లెక్చరర్‌గా పని చేస్తుంటాడు. తను పర్మినెంట్ అవ్వాలంటే అల్రెడీ అక్కడ పనిచేస్తున్న లెక్చరర్స్‌లో ఎవరో ఒకరి దగ్గర అసిస్టెంట్‌గా కొన్నాళ్లు పనిచేయాలి. తనెవరి దగ్గరైతే పనిచేశాడో.. వాళ్లకు విష్ణు ప్రవర్తన, కేపబులిటీ నచ్చితే.. వాళ్లు కాలేజ్ హై కమాండ్‌కి రిఫర్ చేస్తే అప్పుడు అతను పర్మినెంట్ లెక్చరర్ అవుతాడు. దీనికోసం సర్వవిధాలా ప్రయత్నిస్తుంటాడు విష్ణు. అయితే.. విష్ణుని ఎలాగైనా కాలేజ్ నుంచి పంపించేయాలని కొందరు లెక్చరర్స్ ప్రయత్నిస్తుంటారు. విష్ణుని ఎవరి దగ్గరా చేరనీయకంపడా పావులు కదుపుతుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో అదే కాలేజ్‌లో పనిచేస్తున్న లేడీ లెక్చరర్ మనీషా(నయన్‌సారిక) విష్ణుని తన అసిస్టెంట్‌గా చేర్చుకుంటుంది. మనీషా అదొ౦క టైప్. అన్ని వ్యసనాలూ ఉన్నట్టు కనిపిస్తున్న మనీషా దగ్గర తప్పక పనిచేస్తుంటాడు విష్ణు. కొన్ని నాటకీయ పరిణామాల కారణంగా మనీషా, విష్ణు ప్రేమలో పడతారు. పెళ్లి కూడా చేసుకోవాలనుకుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో విష్ణుకు మనీషాకు సంబంధించిన ఓ నిజం తెలుస్తుంది. ఇంతకీ ఏవిటా నిజం? అసలు అన్ని వ్యసనాలూ ఉన్న అమ్మాయిలా మనీషా ఎందుకు కనిపించింది? అసలు శ్రీవిష్ణుకు మనీషా ఎందుకు దగ్గరైంది? మనీషాకూ, విష్ణుకీ పెళ్లి జరిగిందా? ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానమే మిగతా కథ. కథలోని కాంప్లిట్టే వెరైటీగా ఉంది. ప్రారంభం నుంచి ప్రశ్నలతోనే కథను మొదలుపెట్టాడు దర్శకుడు యదునాథ్ మారుతీరావు. జాతకాలను అతిగా విశ్వసించే హీరో.. జాతకంలో ఉండకూడని లోపం ఉన్న హీరోయిన్. ఇలాంటి ఇద్దరూ ప్రేమలో పడితే?.. అనేది ఈ కథలో కొత్తపాయింట్. దాన్ని దర్శకుడు మారుతీరావు వినోదాత్మకంగా చెప్పాడు.

# ది కేరళ స్టోరీ 2‘ చిత్రం విడుదలకు మార్గం సుగమం..

## స్టే ఎత్తివేసిన హైకోర్టు డివిజన్ బెంచ్

‘ది కేరళ స్టోరీ 2‘ సినిమా విడుదల కాకుండా కేరళ హైకోర్టు సింగిల్ బెంచ్ ఇచ్చిన స్టేను డివిజన్ బెంచ్ ఎత్తివేసింది. దీంతో ఈ చిత్రం విడుదలకు మార్గం సుగమమైంది. ఈ చిత్రం విడుదల కాకుండా హైకోర్టు సింగిల్ బెంచ్ ఇటీవల స్టే ఇచ్చింది. సీబీఎఫ్‌సీ తీరును తప్పుబడుతూ సినిమాను పునఃపరిశీలించాల్సిందిగా ఆదేశించింది. 15 రోజుల పాటు సినిమాపై స్టే విధించింది.సింగిల్ బెంచ్ తీర్పును చిత్ర నిర్మాత కేరళ హైకోర్టు డివిజన్ బెంచ్‌లో సవాల్ చేశారు. ఈరోజు సాయంత్రం వరకు ఇరువర్గాల తరఫున సుదీర్ఘ వాదనలు విన్న జస్టిస్ సుశ్రుత్ అరవింద్ ధర్మాధికారి, జస్టిస్ పీవీబాలకృష్ణన్‌లతో కూడిన డివిజన్ బెంచ్ సింగిల్ బెంచ్ ఇచ్చిన స్టేను ఎత్తివేసింది.2023లో విడుదలైన ‘ది కేరళ స్టోరీ‘ చిత్రానికి సీక్వెల్ ‘ది కేరళ స్టోరీ 2‘ రూపొందింది. దీనికి కామాఖ్య నారాయణ్ సింగ్ దర్శకత్వం వహించగా, విపుల్ అమృత్ లాల్ షా నిర్మించారు. ఉల్కా గుప్త, అదితి బాటియా, ఐశ్వర్య ఓజా ఈ చిత్రంలో నటించారు. నిజ జీవితంలో జరిగిన అంశాలతో ఈ చిత్రాన్ని రూపొందించినట్లు చెబుతున్నారు. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 27న విడుదల చేస్తామని చిత్ర బందం ప్రకటించగా, సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పుతో వాయిదా పడింది. ఈరోజు డివిజన్ బెంచ్ తీర్పుతో ఈ సినిమా విడుదలకు అడ్డంకులు తొలగిపోయాయి.

# ‘డెకాయిట్‘ కోసం వరంగల్ భద్రకాళి ఆలయంలో అడివి శేష్



విడుదలకు ముందు వరంగల్ భద్రకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు
శేష్, మృణాల్‌పై చిత్రీకరించిన ‘రుబరూ‘ అనే రొమాంటిక్ సాంగ్ విడుదల
ప్రేమ, ప్రతీకారం నేపథ్యంలో పాన్ ఇండియా స్థాయిలో ఏప్రిల్‌లో రిలీజ్

వరుస విజయాలతో దూసుకుపోతున్న యంగ్ హీరో అడివి శేష్ తన తదుపరి చిత్రం ‘డెకాయిట్‘ ప్రమోషన్లను వినూత్నంగా ప్రారంభించాడు. ఏప్రిల్‌లో సినిమా విడుదలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో, చిత్ర బృందం వరంగల్‌లోని ప్రసిద్ధ భద్రకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించింది. ఈ సందర్భంగా శేష్ మాట్లాడుతూ, ఈ సినిమా తనకెంతో ప్రత్యేకమని, కథ ప్రారంభ దశ నుంచే తాను భాగస్వామిని అయ్యానని తెలిపాడు.ప్రమోషన్స్‌లో భాగంగా చిత్రంలోని తొలి పాట ‘రుబరూ‘ను విడుదల చేశారు. అడివి శేష్, కథానాయిక మృణాల్ ఠాకూర్‌పై ఈ పాటను చిత్రీకరించారు. ఈ రొమాంటిక్ గీతం సినిమాలోని భావోద్వేగాలను చక్కగా ప్రతిబింబిస్తుందని అడివి శేష్ అన్నాడు. “ప్రేక్షకులతో ఈ కథను పంచుకునే ముందు, అమ్మవారి ఆశీస్సులు తీసుకోవాలనుకున్నాను. ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాం. ఏప్రిల్‌లో మీరందరూ చూస్తారని ఆశిస్తున్నాను“ అని పేర్కొన్నాడు.

